ENTERED
KSR02B124 C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 05, 2016

యదార్థ చిత్రం

A review on TELUGU DOCUMENTARIES

ఆల్ గాళ్స్ బ్యాండ్

ప్రజక్త శుక్రె

ప్రస్తుతం హిందీ సంగీత ప్రపంచంలో ఓ కొత్త హవా నడుస్తోంది. అదే మ్యూజిక్ బ్యాండ్‌ల ట్రెండ్. సంగీతంలో ఆరితేరిన కొందరు ఒక బృందంగా మారి జోరుగా సంగీత హోరులో ముంచేస్తున్నారు. శంకర్, ఎహసాన్, లాయ్‌ల త్రయం గురించి తెలిసిందే. కానీ ఇప్పుడు ఆల్ గాళ్ బ్యాండ్‌తో ఇండీపాప్‌కు కొత్త రిథమ్ తెచ్చేస్తున్నారు హిందీ సినిమాల నేపథ్య గాయనులు, పాప్ తారలు, వాద్యకారులు. సినీ సంగీతంతో పాటు ప్రైవేట్ ఆల్బమ్స్‌కి 1990 నుండే మంచి క్రేజ్ ఉంది. పాపులర్ గాయనీమణులు అంతర మిత్ర, మీనల్ జైన్, ప్రజక్త శుక్రె, మాలి దేవ్, హిమాని కపూర్‌లు. సునీత రావ్ 'పరీ హు మై' పాటకి కొత్త రెండిషన్‌ని అందించనున్నారు. మ్యూజిక్ బ్యాండ్‌లో సంగీతకారులుగా మహిళలు చాలా అరుదుగా కనిపిస్తారు. కొన్ని బ్యాండ్‌ల్లో కీ బోర్డ్, ఫ్లూట్‌లు, గిటార్‌లతో యువతులు కనిపించినా డ్రమ్స్ బీట్‌ను మాత్రం అరుదుగా ఇస్తుంటారు. కానీ, గాయని కనిక కపూర్ ఇలా కొత్త బీట్‌ను ఇవ్వనుంది. ఇండస్ట్రీలోకి ఎలా ప్రవేశించాలో తెలీని వారికి మంచి స్టార్టప్‌గా నిలవబోతోంది 'ఆల్ గాళ్స్' బ్యాండ్.

మాలి దేవ్

మీనల్ జైన్

కనిక కపూర్

అంతర మిత్ర

ENTERED KSR02 B124

సందర్భం



ఫిన్‌ల్యాండ్ విద్యా వ్యవస్థలో 'ఫినామినన్' బోధనతో అద్భుతాలు సృష్టిస్తోంది. ఓ డాక్టర్‌ను ఎలా తయారుచేస్తుందో టీచర్‌ను అంతే ప్రాధాన్యతనిచ్చి మెరుగుదిద్దుతోంది. కొన్ని గంటల్లోనే తరగతుల్లో పాఠాల్ని చుట్టేసి.. మైదానంలో పిల్లల్ని కేరింతలు కొట్టేలా జాయ్ చదువుకు కరిక్యులమ్ వేసుకుంది. 'లెస్ ఈజ్ మోర్' (కొంచెమే ఘనం) అంటూ చదువుల భారం మోపకుండా మెల్లిగా, లోతుగా, ఉన్నతంగా, ఉత్తమంగా, వాస్తవంగా విద్యనందిస్తోంది. పీసా అధ్యయనంలో అత్యుత్తమ విద్యావిధానంగా గుర్తింపు సాధించి అమెరికా, బ్రిటన్‌లే వారి వత్తిడి చదువుల విధానానికి స్వస్తి పలికేలా ప్రేరణనిస్తోంది. మనకూ ఆ విధానం ఒంటబడితే చదువుల కూలీల మాట ఉండదు.

చదువంటే ఇదీ..!

కొన్ని రోజుల్లో బడులు మొదలవబోతున్నాయి. ఈ పాటికే తరగతి పాఠాల్ని ప్రైవేట్ ట్యూషన్లలో పరిచయం చేసేసుంటారు. ఓ బస్తాడు పుస్తకాలతో వెన్ను వంగిపోయి బడికి పోయే చిన్ని ప్రాణాల్ని చూస్తే చాలా జాలేస్తుంది. పొద్దున్నే ట్యూషన్, సాయంత్రమో ట్యూషన్ మొత్తం రోజంతా చదువు చాకిరీనే. అందుకే పిల్లలకు సెలవులు అయిపోతున్నాయంటే జ్వరం పట్టుకుంటుంది. స్కూలంటే జైలు గుర్తొస్తుంది. కానీ ఫిన్‌ల్యాండ్ పిల్లలు మాత్రం ఎగిరి గంతేసుకుంటూ బడికి చలోచలోమంటారు. వారి కేరింతలు మైదానంలోనే కాదు తరగతి గదిలోను వినిపిస్తాయి. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యా వ్యవస్థగా గుర్తింపు పొందిన ఫిన్‌ల్యాండ్ విజయ సూత్రం 'లెస్ ఈజ్ మోర్'. పుస్తకాలు, పాఠాలు, తరగతి గంటలు, పనివేళలు, పరీక్షలు చివరకు విద్యార్థులపై చదువుల భారం లెస్. అనుభవం, వృత్తి విద్య, ఆటలు-పాటలు, ప్రాక్టికల్ ట్రైనింగ్, ప్రేరణ, సెలవులు.. చివరకు బడిలోనే కాదు సమాజంలోను విద్యార్థుల ఫలితాలు మోర్. వారి జీవన విధానంలో భాగమైన 'కొంచెమే ఘనం' సిద్ధాంతం అక్కడి విద్యా వ్యవస్థలో పెను మార్పులు సృష్టించి పీసా అధ్యయనం ప్రకారం ప్రపంచానికి ఆదర్శవంతమైన విద్యా విధానంగా మారింది.

తక్కువ బోధన ఎక్కువ ఆప్షన్లు

ఏడేళ్లకు వారికి ఫార్మల్ ఎడుకేషన్ మొదలౌతుంది. పిల్లల్ని పిల్లల్లానే చూస్తారు గానీ ముందు నుంచే బండ రుద్దుడు మొదలేయరు. ఓ తరగతి గదిలో బంధీలై బాల్యాన్ని కోల్పోకుండా ఆటపాటల్లో ఉల్లాసంగా ఉండేలా చూస్తారు. తర్వాత తొమ్మిదేళ్ల తప్పనిసరి విద్య తర్వాత వారు మూడేళ్ల అప్పర్ సెకండరీ (హైస్కూల్, కాలేజీల మిక్చర్), వొకేషనల్, ఉద్యోగాల్ని ఎంచుకోవచ్చు. అప్పటికి వారికి 16 ఏళ్లు నిండుతాయి.

9 టు 2

పాఠశాలలు ఉదయం 9-9.45 నుంచి మధ్యాహ్నం 2-2.45 మధ్య వరకే. ఓ అధ్యయనం ప్రకారం తెల్లారిజామున నిద్ర విద్యార్థులకు చాలా అవసరమని తేలింది. అందుకే వాతావరణం, కాలాల్ని బట్టి సమయాన్ని అటూ ఇటూ మారుస్తుంటారు. కేవలం 3 లేదా 4 పిరియడ్లు మాత్రమే ఉంటాయి. అవి కూడా చాలా బ్రేక్‌ల మధ్య. దీని వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులకు కావాల్సిన విశ్రాంతి లభిస్తుంది. తర్వాతి పిరియడ్‌కు ఉత్సాహం ఆవిరవ్వదు. ఒక్కో పిరియడ్ 75 నిమిషాలు కొన్ని విరామాల మధ్య ఉంటుంది. ఒక్కో విరామం 15-20 నిమిషాల పాటు ఉంటుంది. అవసరమైతే క్లాస్‌లే రద్దు చేసి తర్వాత పెడతారు. ఇది పిల్లలకు స్వేచ్ఛనివ్వడమే కాక ఫిజికల్‌గా యాక్టివ్‌గా ఉంచుతుంది.

తక్కువ గంటలు ఎక్కువ ప్లానింగ్

ఏడాదిలో ఓ ఫిన్నిష్ టీచర్‌కు 600 బోధనా గంటలు మాత్రమే ఉంటాయట. రోజుకు 4 కంటే తక్కువ పిరియడ్లు మాత్రమే చెబుతారట. తరగతులు లేకుంటే ఆ రోజు బడికి వెళ్లాల్సిన పని టీచర్లకే కాదు విద్యార్థులకు కూడా ఉండదు. పిరియడ్ మధ్యాహ్నం ఉంటే ఆ సమయానికి బడికి చేరుకుంటే సరి. ఇది ప్లానింగ్‌కు అవకాశాన్ని కల్పిస్తుంది.

అగ్నిపరీక్షలు లేవు

వంట, కలప పనితో పాటు కుట్టు పని వరకు వాస్తవ జీవితానికి అవసరమైన విద్యలతో ఒక్కో విద్యార్థి అవసరాలకు తగ్గట్టు పర్సనలైజ్డ్ కరిక్యులమ్‌ను ఉపాధ్యాయులు రూపొందించుకుంటారు. మార్కులు, ర్యాంకులు అంటూ వేధించే అవకాశాన్ని ప్రభుత్వం కూడా ఇవ్వదు. పరీక్షలనేవి కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానానికి సంబంధించిన వాటిలా కాకుండా ఓ ఉత్తమ వ్యక్తిగా వాస్తవ ప్రపంచానికి కావాల్సిన నైపుణ్యాల్ని పెంపొందించుకుంటున్నారా లేదా అనేదే చూస్తారు.

తక్కువ పాఠ్యాంశాలు లోతైన పరిశీలన

గణితానికి సంబంధించిన పాఠ్యాంశాల్ని ఒక్కో తరగతిలో కొత్తవి పరిచయం చేస్తూ వాటిపై మంచి పట్టు సాధించేలా లోతైన బోధన ఉంటుంది. అన్ని అంశాల్ని విద్యాసంవత్సరాల్లో జొప్పించే ప్రయత్నం చేయరు. గణితం పిరియడ్లు కూడా వారంలో కొన్ని రోజులే ఉంటాయి. కొన్ని టైంటేబుళ్లలో వారానికోసారి ఉన్నా ఆశ్చర్యపోవాల్సింది లేదు. వేగంగా నేర్చుకోవాలన్న వత్తిడి ఉండదు.

హోమ్ వర్క్ చాలా చాలా తక్కువ

ప్రపంచంలో అతి తక్కువ హోమ్ వర్క్ ఇవ్వబడుతున్న అదృష్టవంతులెవరా అంటే ఫిన్‌ల్యాండ్ విద్యార్థులే. అరగంట కన్నా తక్కువ సమయం ఉండే హోమ్‌వర్క్ మాత్రమే ఉంటుంది. ట్యూషన్లు గట్రా ఉండవు. పాఠంపై ఆసక్తి చూపని వారికి చదువుకు సంబంధించిన ఏదో ఒక టాస్క్ ఇస్తారు. అవి పజిల్ గేమ్స్‌లాంటివిలా ఉంటాయి. ఒక్కో తరగతిలో 20 మంది విద్యార్థులే ఉంటారు. ఉపాధ్యాయులకు ఫిన్‌ల్యాండ్ విద్యావ్యవస్థపై పూర్తి అవగాహన, శిక్షణ ఇచ్చి విద్యార్థులకు ఓ రోల్‌మోడల్‌గా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటుంది.

ఇండెక్స్

స్టార్................3
ప్రియ వదనె..
యువ.............. 4
ఈ దాహార్తి వేరే..!
కార్టూన్ పంచ్......... 5
వింతలోకం...................10
రోలర్ కోస్టర్ సర్ఫింగ్
వినూత్నం................11
తేలియాడే ద్వీపం
కొత్త పుస్తకాలు................14
సరోగసీకి సరైన అర్థం

యదార్థ చిత్రం

అట్టమీది కథ.........6

సేవ - 12
కపడా బ్యాంక్

ప్రత్యేకం...................15
తల్లి లాంటి మార్కెట్
జీవితం 16
టీపీ జంగిల్ బుక్
కథ...............18
నా బిడ్డ నాకు చాలు...
రుచి.....................21
పొట్లకాయ పెరుగు పచ్చడి
బాల నేస్తాలు.............22
కిక్ బాక్సర్
పద వికాసం..........24

కొత్త విషయాలు తెలుసుకున్నాం

స్నేహ అందిస్తున్న ఎన్నో విషయాలు బాగున్నాయి. ఈ వారం మైసూర్ చందనాలు ద్వారా తెలియని విషయాలను తెలిపారు. లోగో చాలా బాగుంది. 'చదివితే ఇక్కడే చదవాలి'లో కొన్ని విశ్వవిద్యాలయాల్ని పరిచయం చేశారు. జీవ వైవిధ్య దినోత్సవం ప్రాణి కోటి ఊపిరిని తెలియజేశారు.ప్రతి జీవి ఉంటేనే జీవ వైవిధ్యం. అయితే ప్రస్తుతం జీవకోటి నశిస్తోంది. మనిషై పుట్టాక మంచి పని చేయాలి అంటారు. అలా హుస్సెయినీ సైకిల్ లైబ్రరీని నడపడం అభినందనీయం. చరమాంకం కథ బాగుంది. అయితే కథ ముగింపు సంతృప్తికరంగా లేదు. లిటిల్ స్టార్ చిన్న నాటి ఫోటో, 3డి ట్రిక్స్, రాచరికపు తారలు బాగున్నాయి. ఎన్నో రకాల తాబేళ్లను పరిచయం చేయడం సంతోషాన్నిచ్చింది.

-బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆముదాలవలస

మైసూర్ చందనాలు

స్నేహ ఆదివారం అనుబంధంలో చందనం గురించి వాటి ఉత్పత్తుల గురించి మైసూర్ శాండల్ సోప్ పూర్వ వైభవం గురించి తెలిపిన అట్ట మీది కథ చాలా బాగుంది. వారం వారం చక్కటి విజ్ఞాన విషయాలు అందిస్తున్న ప్రజాశక్తి



ఆదివారం అనుబంధం విభాగం వారికి ధన్యవాదాలు.

-ఎల్. ప్రఫుల్లచంద్ర, ధర్మవరం

సోలార్ కిడ్స్

క్లిష్టమైన పరిశోధనల ఓ కొత్త లోకం చూపింది స్నేహ. మాయా నాగరికతపై సిద్ధాంతీకరించిన విలియమ్ గడౌరి, వేస్ట్ ప్లాస్టిక్ బాటిళ్లతో ఎయిర్ కూలర్లు, వాటితోనే ఇళ్లు నిర్మించుకున్న ఔత్సా హికులు ఈ ఆవిష్కరణల్లో ముఖ్యులు. బాస్కింగ్ షార్క్ పరిచయం, తాబేలు జీవిత విధానం, 3డి ఆర్ట్ చిత్రాలు ఆకర్షించాయి. మహి ళా టన్నెల్ ఇంజనీర్ యాస్మీ, ఫేమస్ వర్ధమాన తార అనుపమ కథనాలు బాగు న్నాయి. అట్ట మీది కథ మైసూర్ శాండిల్ సోప్ ను పూర్తిగా ఆస్వాదించాం. స్పెషల్ సోప్ ధర రూ.2800 షాకిచ్చింది. మానవ శరీరంలో అర్థం కాని రహస్యాలెన్నో.. వాటికి ఉదాహరణ పాకి స్తాన్ చిన్నారులు సోహెల్ అహ్మద్, అబ్దుల్ రషీద్‌లు.

టి.సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

ఆకట్టుకున్నాయి

పశ్చిమ కనుమల్లోని అటవీ గ్రామాల్లో వెలుగులు నింపి, ప్రభుత్వం చేయలేని పనుల్ని చేసి చూపించిన వెలుగు పూలకి అభినందనలు. కురుల కుట్టి, మాయా వండర్ కిడ్, వింత లోకం, ప్లాస్టిక్ గృహాలు, సైకిల్ లైబ్రరీ ఆకట్టుకున్నాయి. రాచరికపు తారలు, తాబేళ్ల నిండు నూరేళ్లు, చరమాంకం, బాస్కింగ్ షార్క్ ఆద్యంతం చదివించాయి.

-శ్వేత, తిరుపతి

సవరణ

గత సంచిక 'జయం రవి' వ్యాసంలో...
రవి నటించిన 'జయం' తెలుగులో నితిన్ హీరోగా 'జయం' పేరుతో వచ్చిన చిత్రానికి రీమేక్.
'ఎం.కుమారన్ సన్నాఫ్ మహా లక్ష్మి' 'అమ్మా నాన్న తమిళ అమ్మాయి'కు రీమేక్.
మోహన్ రాజా డైరెక్షన్‌లోనే వచ్చిన 'సంతోష్ సుబ్రమణ్యం' కూడా తెలుగు 'బొమ్మరిల్లు' రీమేక్‌గా చదువుకోగలరు.

-ఎడిటర్

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

హరి ప్రియ

ప్రియ వదనే..

మోడలింగ్ నుంచి సినిమా రంగానికి వచ్చిన కథానాయిక హరిప్రియ. భరత నాట్య కళాకారిణి. తాతగారి ప్రోత్సాహంతో రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టింది. 16 ఏళ్ల తన సినీ కెరీర్‌లో 29 సినిమాల్లో నటించింది. మొత్తం నాలుగు దక్షిణాది భాషా చిత్రాలో ఆమె నటించడం విశేషం. కన్నడలో రెండు సార్లు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డులు వరించాయి. ఇప్పటికీ ఓ పక్క హీరోయిన్‌గా చేస్తూనే మరో పక్క సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ కళా ప్రదర్శనలు ఇస్తుండటం విశేషం.

హరి ప్రియ అసలు పేరు శృతి. చిత్రసీమ ఆమెకు పెట్టిన పేరు హరి ప్రియ. చంద్ర అని కూడా పిలుస్తారు. ఈమె కర్నాటకలో కోలార్‌లో (చిక్‌బల్లాపూర్)లో 1988 అక్టోబర్ 29న జన్మించింది.

- బెంగళూరులో ఆమె భరత నాట్యం నేర్చుకుంది. హరి ప్రియ ఇంటర్మీడియేట్ చదువుతున్నప్పుడు స్టేజ్ ప్రదర్శనలు ఇస్తూ ఉండేది. ఈమె 2000లో హీరోయిన్‌గా సినీ కెరీర్‌ను ప్రారంభించింది.
- ఈమె సినిమా రంగంలోకి రావడానికి కారణం తన తాతగారేనట. ఎందుకంటే ఆయన రంగస్థల నటుడు. సినిమా రంగంలో మంచి కెరీర్ ఉంటుందని నిత్యం చెబుతూ ఉండేవారట. ఆ మాటలే మోడలింగ్ నుంచి రంగుల ప్రపంచంలోకి వచ్చేలా చేశాయి.
- మొదటిసారిగా మలయాళ చిత్రం 'వర్ణక్కాఙ్ఞ కల్'లో కథానాయికగా చేసింది. దీనికి సుందర్ దాస్ దర్శకుడు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లలో ఈమె ఒకరు.
- ఈమె ఒక పక్క మోడలింగ్, మరో పక్క సిని మాలు చేస్తూనే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కు వగా పాల్గొంటుంది. ఇప్పటికీ స్టేజ్ షోలు ఇస్తుంది.
- మొదట సినిమా చేసిన తర్వాత అవకాశాలు రాలేదు. మళ్లీ నాలుగేళ్ల తర్వాత 'రసికన్' చిత్రంలో నటించింది. తర్వాత స్టేజ్ ప్రొగ్రామ్స్ ఇస్తూ ఉండేది. ఆ సమయంలో దర్శకుడు రిచర్డ్ క్యాస్టెలినో చూశారు. వెంటనే ఆయన తుళు భాషలో 'బడి' చిత్రంలో అవకాశమి చ్చారు. ఆ సినిమా 2007లో విడుదలైంది.
- తన మాతృభాష కన్నడలో మాత్రం మొదటిసారిగా 2008లో 'మనసుగుల మధు మధుర' సినిమాలో చేసింది.
- 2009లో చేసిన 'కల్లర సాంతే' చిత్రంలో ఆమె నటనకు ఆ ఏడాది ఉత్తమ కన్నడ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది.
- హరిప్రియకు మంచి పాపులారిటీ లభించింది. తర్వాత ఏడాది చేసిన 'చెలువేయే నిన్నే నొదలు' చిత్రంతో ఆ ఆదరణ మరింత పెరిగింది. ఇక కన్నడలో ఈమె కూడా ప్రముఖ నటీమణుల జాబితాలో చేరిపోయింది.
- 2010 ఆమెకు కలిసొచ్చిన ఏడాది అని చెప్పాలి. ఎందుకంటే ఆ సంవత్సరంలో తమిళం, తెలుగు భాషల్లో నటించే అవకాశం ఒకేసారి వచ్చింది. ఈమె దక్షిణాది భాషలన్నింటిలోనూ నటించినట్టయింది.
- తెలుగులో మొదటిసారిగా నటి భూమిక సమర్పణలో వచ్చిన 'తకిట తకిట' చిత్రంలో మెరిసింది. ఇది తమిళంలో 'తుల్లి ఇజున్‌తతు కాధల్' పేరుతో అనువదించారు. తమిళంలో డైరెక్ట్‌గా అదే ఏడాది 'కనగవెల్ కాక', 'వల్లకొట్టయి' చిత్రాల్లో నటించింది.
- తర్వాత ఏడాది నాని హీరోగా చేసిన పిల్ల జమీందార్'లో తన నటనతో మెప్పించింది.
- సుమారుగా 12 ఏళ్ల తర్వాత అంటే 2012లో మళ్లీ తనకు అవకాశం ఇచ్చిన మాలీవుడ్‌లో జయరామ్ హీరోగా చేసిన 'తిరువంబది తంబన్' చేసింది.
- ఆ సమయంలోనే తెలుగులో 'అమ్మాయి క్లాస్-అబ్బాయి మాస్'లో చేసి ప్రేక్షకులను అలరించింది. సినిమా ఫలితం ఏమైనా హరిప్రియ తన నటనతో ఆకట్టుకుంది.
- ఈ సినిమాలో కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ పాత్ర చేయడం కోసం ప్రత్యేకంగా ఓ కాల్ సెంటర్‌లో రెండు వారాల పాటు వారి విధుల్ని గమనిం చింది.
- 2014లో కన్నడంలో చేసిన 'ఉగ్రమ్'లో తన పెర్ఫార్మెన్స్‌కు కన్నడ భాషల్లో ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు లభించింది. అదే ఏడాది తెలుగులో 'గలాట', 'ఈ వర్షం సాక్షిగా' చిత్రాల్లో చేసింది.
- గత ఏడాది నాలుగు సినిమాలూ కన్నడంలోనే చేసింది. ఈ ఏడాది తమిళంలో నటించిన 'వారాయో వెన్నిలవె' చిత్రానికి ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో విడుదల కానుంది. దీంతో పాటు మలయాళంలో ఒకటి, కన్నడంలో రెండు చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి.

- కొప్పుశెట్టి దేవరాజు

యువ

ఈ దాహార్తి వేరే...!

ఉప్పు కయ్యల్లో ఎండ వేడి రెట్టింపు అవుతుంది. అక్కడ కాసేపు నడిస్తే చాలు దాహం దాహం అంటూ నాలుక పిడచకట్టుకుపోతుంది. గటగటా నాలుగ్లాసులు నీళ్లు తాగాక కానీ ప్రాణం లేవదు. కానీ అ కయ్యల్లో పనిచేసే కార్మికులు ఎందుకు నోరు కట్టుకు పని చేసుకుపోతున్నారు. తాగు నీళ్లు దొరక్కా? కాదే నీళ్ల కుండలు కనిపిస్తూనే ఉన్నాయ్. మరేం? నీళ్లెక్కువ తాగితే యూరినల్‌కు పోవాలి. దానికి మరుగు ఉండదు. వందలాది మంది మహిళా కూలీల అవస్థ ఇది. అందుకే గుక్కెడు నీళ్లు తీసుకోడానికి భయపడతారు. తమిళనాడులోని వేదారణ్యమ్ గ్రామంలోని కోవిల్‌తావు ఉప్పు కయ్యల్లో పరిస్థితి ఇది. జీరో డిస్చార్జ్ టాయ్‌లెట్ ద్వారా ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపింది ముంబైకి చెందిన యువతి సోనమ్ ధుంబ్రె.

సోనమ్ ముంబై నగరంలో పుట్టి పెరిగింది. బాల్యం, విద్యాభ్యాసం అన్నీ అక్కడే సాగాయి. పర్యావరణ శాస్త్రంలో పీజీ పూర్తి చేసిన సోనమ్ ముంబైలోని ఒక పేరొందిన సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగంలో చేరింది. కుటుంబం, ఉద్యోగం తప్ప మరే ఇతర విషయాలు పట్టని సోనమ్ జీవితాన్ని కొత్త ఆలోచనల వైపు నడిపించింది ఆమె కాలక్షేపం. సరదాగా ఇంటర్‌నెట్ బ్రౌజ్ చేస్తున్న సోనమ్‌కి ఎస్‌బిఐ 'యూత్ ఫర్ ఇండియా' వెబ్‌సైట్ కనిపించింది. గ్రామీణాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఎంతో మంది యువత దానిలో పేరు నమోదు చేసుకుంటారు. సొంత ఆలోచనలతో ముందుకొచ్చే యువతకు ఎస్‌బీఐతో పాటు ప్రభుత్వేతర సంస్థలు కూడా ఆర్థిక సాయాన్ని అందిస్తుంటాయి. సోనమ్ దీన్ని ఒక చక్కటి అవకాశంగా భావించింది. అప్పటికే తమిళనాడులోని కోవిల్‌తావు ఉప్పు కయ్యల్లో పనిచేస్తున్న మహిళల అవస్థల గురించి తెలుసుకున్న సోనమ్ అందుకు కారణాలు తెలుసుకోవడంతోపాటు పరిష్కారాన్ని కనిపెట్టే దిశగా అక్కడకి చేరుకుంది. అక్కడి ప్రజలు సోనమ్‌కి చెప్పిన అనేక విషయాలు ఆమెని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఎనిమిది నుండి పది గంటల పాటు పనిచేస్తున్నా పని ప్రదేశంలో టాయిలెట్లు ఉండవు. అక్కడ కూలీలుగా పనిచేస్తున్న ఎందరినో తరాలుగా వేధిస్తున్న సమస్య ఇది. పురుషులు దాదాపు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి బహిరంగంగానే మూత్ర విసర్జన చేస్తుంటారు. మహిళలు అంత దూరం వెళ్లినా దరిదాపుల్లో టాయిలెట్లు కనిపించని పరిస్థితి. పని వత్తిడిలో ఎక్కువ దూరం ప్రయాణించే సమయం లేకపోవడంతో దప్పిక ఉన్నా నీరు తాగడం మానుకునే వారు కొందరైతే.. పనిచేసే సమయంలో కిలోమీటర్లు నడిచెళ్లి మూత్ర విసర్జనకెళితే కూలీ డబ్బు కూడా తగ్గించి ఇవ్వడంతో నీటిని తీసుకోవడం పూర్తిగా మానుకోవాల్సొచ్చింది. ఇలా యూరినల్‌ను ఆపుకోవడం తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. ఎక్కువ మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో పాటు డీహైడ్రేషన్, రక్తలేమి వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. సముద్రపు నీటి నుండి ఉప్పు తయారు చేస్తున్న తేమ ప్రదేశాల్లో టాయిలెట్లు ఉండటం వల్ల ఉప్పు నీటిలో చెడు నీరు కలిసే ప్రమాదం ఉందని, అందుకు పని ప్రదేశాల్లో టాయిలెట్స్ నిర్మించడం సాధ్యపడదనేది యజమానుల వాదన. ఇవన్నీ జాగ్రత్తగా గమనించిన సోనమ్ ఒక్క శాతం కూడా కలుషితం చేయని టాయ్‌లెట్లను రూపొందించే పనిలో పడింది. ఉప్పు కయ్యల్లోకి ఇంకని విధంగా 'జీరో లిక్విడ్ డిస్చార్జ్ యూరినల్' నమూనాని తయారుచేసింది సోనమ్. ఈ నమూనా ప్రకారం మరుగుదొడ్డి సమీపంలో కాంక్రీట్ బెడ్స్‌ని ఏర్పాటుచేస్తారు. వాటిలో యూరియా, లవణాల్ని మొత్తానికి పీల్చేసే కొన్ని రకాల మొక్కల్ని పెంచుతారు. టాయిలెట్స్ నుండి కాంక్రీట్ బెడ్స్‌లోకి చేరే విసర్జిత నీటిని బైటికి వెళ్లకుండా మొక్కలే తీసుకుంటాయి. అలా పెరిగిన మొక్కల్ని కొన్ని జంతువులకు ఆహారంగా వేయొచ్చు. లేదా ఏపుగా పెరిగిన మొక్కల్ని కత్తిరించేయవచ్చు. మనదేశంలో ఇప్పటి వరకూ ఎక్కడా ప్రయోగించని కొత్త నమూనా కూడా ఇదే. 'జీరో లిక్విడ్ డిస్చార్జ్ యూరినల్' ఆలోచన సోనమ్ ప్రపంచానికి పరిచయం చేసింది. తన చదువు ఇలా గొప్ప మేలు చేసింది. వేదారణ్యంలో 118 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఉప్పు కయ్యల్లో పనిచేస్తున్న దాదాపు 90 కుటుంబాలతో పాటు చుట్టుపక్కల ప్రదేశాల నుండి రోజు కూలీలుగా వచ్చే ఎంతో మందికి ఇది ఉపయోగపడింది. 2014లో తన ఫెలోషిప్‌ని ముగించుకున్నా అక్కడి కార్మికులతో ఏర్పడిన అనుబంధంతో వారికి మరిన్ని మెరుగైన సౌకర్యాలను అందించే దిశగా కొత్త ఆలోచనలు చేస్తోంది సోనమ్. కూలీ మహిళల దప్పిక తీర్చిన సోనమ్ దాహం అదే. సమాజానికి మేలు చేయాలనే యువతకు ఆమె ప్రతిరూపం.

- శర్వాణి



కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్



అతితెలివి

భార్య: ఏం చేస్తున్నారక్కడ?

వెంగళప్ప: మొక్కలకి నీళ్లు పెడుతున్నా...

భార్య: వర్షం పడుతోందిగా!

వెంగళప్ప: ఫర్వాలేదు, గొడుగు వేసుకునే పోస్తున్నా...

అర్ధ రూపాయి

బిచ్చగాడు: బాబూ గుడ్డివాడిని ఒక రూపాయి ధర్మం చేయండి.

వెంగళప్ప: నీకు ఒక కన్ను పూర్తిగా కనిపిస్తోందిగా??

బిచ్చగాడు: అయితే అర్ధరూపాయి దానం చేయ్యండి బాబూ!

కొట్టేశా

గోపాల్ : ప్రకాష్ నీ సూట్ చాలా బాగుంది. ఎక్కడ కుట్టించావు?

ప్రకాష్ : ఆ టైలర్ అడ్రస్ ఇస్తాను. అయితే ఇక కండిషన్.

గోపాల్ : ఏంటది?

ప్రకాష్ : నా అడ్రస్ ఆ టైలర్‌కి మాత్రం చెప్పకూడదు!

జంతువు

భర్త: భార్యతో... నువ్వు నాలోని జంతువుని నిద్ర లేపుతున్నావ్

భార్య: లేవనివ్వండి... పిల్లికి ఎవరూ భయపడరు.

భార్య: ఏమండి! మీ ఫ్రెండ్‌కి మీరైనా చెప్పండి తను చేసుకునే అమ్మాయి అతనికి తగిన జోడీ కాదని.

భర్త: నేను ఎందుకు చెప్పాలి...?వాడు నా పెళ్లప్పుడు వాడు నాతో చెప్పాడా ...!!!

యదార్ధ చిత్రం

A Review on Telugu Documentaries



జూన్ నెల వచ్చేసింది అనగానే యువతకు కొత్త ఉత్సాహం వస్తుంది. చదువుకుంటున్న వారికి కొత్త తరగతి గదులు ఊరిస్తుంటాయి. యువతరానికి కొత్త ఆలోచనల వెల్లువ పులకరింతనిస్తుంది. ఈ మండే ఎండల నుంచి కొత్త వసంతంలోకి అడుగిడుతున్న భావన అద్భుతంగా ఉంటుంది. అద్భుతమంటే గుర్తొస్తుంది... మనం మంచి మంచి సినిమాలు తెగ చూసేసుంటాం... ఇంటర్నెట్‌లో అయితే ఈ మధ్య ప్రవాహంలా వస్తున్న షార్ట్ ఫిల్మ్‌లన్నీ తిరగేసుంటాం... టీవీల్లో అయితే చెప్పేదేముంటుంది...టీవీ అంటే రోజువారీ జీవితంలో భాగమైపోయిందిగా... అయితే ఈ మాధ్యమాలన్నింటిలో డాక్యుమెంటరీ అనేది చాలా వైవిధ్యమైనది. కొన్ని మాధ్యమాల్లో నిజమైన సంఘటనలను సంక్షిప్తంగా వార్తల రూపంలో ప్రసారం చేస్తే, సినిమావాళ్ళు వాటికి మసాలా దట్టించి సినిమాగా తీస్తారు. అయితే డాక్యుమెంటరీ లక్షణం అదికాదు. నిజం చెంతకువెళ్ళి నిజాన్ని చిత్రించి నిక్షిప్తం చేస్తుంది. ఆ నిజం మన చుట్టుపక్కలే ఉంటుంది. మనం చూసేది, చేసేది అంతా నిజమే దాన్ని చిత్రీకరిస్తే అదే డాక్యుమెంట్రీ... ఆ నిజాలను మన జేబులో ఉండే కెమేరా ఫోన్‌తోనైనా చిత్రీకరించవచ్చు. తెలుగులో రూపొందించిన డాక్యుమెంట్రీల విశేషాలు, విశ్లేషణ ఈ వారం మీ ముందు...

షార్ట్ ఫిల్మ్ ఒక కథ, సినిమా ఒక నవల అనుకుంటే, డాక్యుమెంటరీ ఒక చారిత్రక పుస్తకం లాంటిది. డాక్యుమెంటరీ అంటే ఒక "నాన్ ఫిక్షనల్ మోషన్ పిక్చర్". చారిత్రక సంఘటనలను ఆధారం చేసుకుని లేదా జరిగిన, జరుగుతున్న సంఘటనల గురించి సమాచారం అందించటం లేదా సమాచారాన్ని సేకరించి పొందుపరచటం ప్రాథమికంగా దీని ఉద్దేశ్యం. అంతకుమునుపు ఫిల్మ్‌లోనే డాక్యుమెంటరీలు రూపొందించేవారు. ప్రస్తుతకాలంలో వీడియో టెక్నాలజీలో మార్పులు, డిజిటల్ ప్రొడక్షన్స్ చిత్రరంగంలో విప్లవాత్మకమైన మార్పుకు కారణమయ్యాయి. అందువలన డాక్యుమెంటరీ నిర్మించటం సులువైంది. ఎలాంటి ఇతిమిద్ధమైన బౌండరీలు లేకుండా క్రమంగా కొనసాగుతున్న ఈ డాక్యుమెంటరీ చిత్రనిర్మాణంలో భాగంగా, సినిమా సాంప్రదాయాలను మిళితం చేసుకుని ప్రేక్షకులను అలరిస్తుంది.

సినిమా అనేది జీవితాన్ని ప్రతిబింబింపచేసే నూతన సృష్టి. అయితే డాక్యుమెంటరీలో మాత్రం నటులు అసలైనవారు ఉంటారు, నిజమైన సంఘటనలు చిత్రీకరించబడతాయి. మోడ్రన్ ప్రపంచాన్ని అర్థం చేసుకుని వివరించటానికి సినిమా కంటే డాక్యుమెంటరీ రూపమే సరైనదని "ఫాదర్ ఆఫ్ డాక్యుమెంటరీ" గ్రీర్సన్ అభిప్రాయం. ఇలాంటి అభిప్రాయాన్నే చాలా నిర్దిష్టంగా 1898లో ప్రచురించబడిన బొలేస్లా మాటుస్జుస్కీ రాసిన 'ఏ న్యూ సోర్స్ ఆఫ్ హిస్టరీ', 'యానిమేటెడ్ ఫోటోగ్రఫీ' అనే పుస్తకాల్లో వివరిస్తారు. డాక్యుమెంటరీలోని ముడిసరుకు నటించిన దానికంటే నిజమైనదనీ, డాక్యుమెంటరీ ద్వారా ఉన్నది ఉన్నట్లు చిత్రీకరించబడుతుందనీ చెప్తారు. నిజాన్ని చూపించే క్రియేటివ్ ట్రీట్‌మెంట్ డాక్యుమెంటరీ అని చెప్పుకోవచ్చన్న మాట!

భారతదేశానికి సంబంధించి 1947లో స్వాతంత్ర్యం వచ్చిన రోజు మొదటి ప్రధానమంత్రి

-ప్రాణి
9494027479

జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగాన్ని చిత్రీకరించారు. ఈ చారిత్రక ఘట్టాన్ని చిత్రీకరించినవారు ఇండిపెండెంట్ ఫిల్మ్‌మేకర్ అంబ్లెస్ జె పటేల్. రెండు కెమేరాలు, సౌండ్ ఎక్విప్‌మెంట్‌తో దీన్ని చిత్రీకరించారు. అప్పటికి దేశంలో ప్రభుత్వం గానీ, మరి ఏ ఇతర వ్యక్తులు గానీ అధికారికంగా దేశం మొత్తానికి సంబంధించిన ఉత్సవాలను చిత్రీకరించలేదు. ఇది అరవై సంవత్సరాల ముందు మాట. ఇప్పుడు ఎంతో మంది ఇండిపెండెంట్ ఫిల్మ్‌మేకర్స్ భారతదేశంలోని కళలు, సామాజిక అంశాలు, ప్రకృతి చరిత్రలను క్రియేటివ్‌గా డాక్యుమెంట్ చేస్తున్నారు. భారత వారసత్వ సంపదైన తాజ్‌మహల్ లాంటివి, కరువు కాటకాలు, పేదరికంతో అల్లాడుతున్న ప్రాంతాలు మొదలైన అంశాలను చిత్రీకరిస్తున్నారు. ఇవన్నీ సాంఘీక,

పర్యావరణ, మానవవాళికి సంబంధించిన అంశాలతో ముడిపడి ఉన్నవే. అంతేకాకుండా మానవ హక్కులు, సెన్సార్‌షిప్, లింగ భేదాలు, మతరాజకీయాలు, వ్యక్తి స్వేచ్ఛ, లైంగిక గుర్తింపులు లాంటి విషయాలను కెమేరాలో బంధించి చరిత్ర గమనాన్ని నిక్షిప్తం చేస్తున్నారు.

తెలుగుకు నీరాజనాలు

తెలుగు రాష్ట్రాల్లో డాక్యుమెంటరీ నిర్మాణం కొంత లేటుగా ప్రారంభమైంది. అయినా కొత్త జనరేషన్ యువత సామాజిక అంశాలతోపాటు, వ్యక్తులు, సంస్థలు, వ్యవస్థల గురించి తమదైన బాణీలో ప్రతిస్పందిస్తూ తెలుగులో డాక్యుమెంటరీలను రూపొందిస్తున్నారు. కొన్ని డాక్యుమెంటరీల విశిష్టతను గుర్తించి ప్రభుత్వం అవార్డులను బహూకరిస్తుంది. డాక్యుమెంటరీ కోవలో నంది అవార్డు సాధించింది 'భవానీ'. హోప్ ఫౌండేషన్ సమర్పించిన ఈ డాక్యుమెంటరీ పన్నెండేళ్ళ అమ్మాయి తన కుటుంబానికి తోడుగా ఉంటూ, నిశ్చలమైన నిబ్బరంతో జీవిస్తున్న తీరును చూపెడుతుంది. కుటుంబంలో తండ్రికి ఎయిడ్స్ వచ్చి చనిపోతే వారి జీవితాలు అస్తవ్యస్తం అవుతాయి. తండ్రి చేసిన తప్పుకు గర్భిణీ అయిన తల్లికి కూడా ఆ వ్యాధి సోకుతుంది. పుట్టుకతోనే ఎయిడ్స్ సోకిన చిన్నారి చనిపోతుంది. మిగిలిన ఇద్దరు ఆడపిల్లల్లో ఒకరు హాస్టల్లో ఉండి చదువుకుంటుంటే, పెద్ద కూతురైన భవాని తల్లిని జాగ్రత్తగా చూసుకుంటూ కన్నీటి జీవితాన్ని గడుపుతుంది. అక్కా గౌడ్ నిర్మించిన ఈ చిత్రం చెడు అలవాట్లతో కుటుంబాన్ని కన్నీటి అగాథంలో తోసేవారికి కనువిప్పు అవుతుంది. ఈ డాక్యుమెంటరీ చివర్లో జగపతిబాబు, తనికెళ్ళ భరణి, రేలంగి నర్సింహారావు లాంటి సినీ ప్రముఖులు వారి అభిప్రాయాలను తెలియజేస్తారు. ఇలాంటి కన్నీటి చరిత్రలు ప్రపంచానికి తెలియటానికి డాక్యుమెంటరీలు రూపొందించాలి అని ముక్తకంఠంతో చెప్తారు.

సామాజిక అవసరం

'వారికి మనం కావాలి' అనే ట్యాగ్‌తో రూపొందించిన చిత్రం "వియ్ నీడ్ యూ". చిన్నపిల్లలకు పెద్దవారి అవసరం ఉండాలి అనే సందేశంతో రూపొందించారు. ప్రాథమికంగా చిన్నపిల్లల భవిష్యత్తు పెద్దలు చూపించే మార్గంపైనే ఆధారపడి ఉంటుందని, కనుక వారికి నడిపించి, వారికి కావలసిన అవసరాలను గమనించి వాటిని తీర్చటానికి మనం సహాయం చేయాలని ఈ డాక్యుమెంటరీ వివరిస్తుంది. సాయి తరుణ్ రూపొందించిన ఈ డాక్యుమెంటరీ పిల్లల వీడియో క్లిప్పింగులతో, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, వాయిస్ ఓవర్‌తో కొనసాగుతుంది. డైరెక్టర్ సిఎన్‌యూ పేరుతో యూట్యూబ్‌లో అప్‌లోడ్ అయిన డాక్యుమెంటరీ 'పసిప్రాణం'. చెన్నంపేట

స్వాతంత్ర్యానికి ముందే

భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందు నుంచే డాక్యుమెంటరీలు వచ్చాయి. 1888లో బొంబేలోని హ్యాంగింగ్ గార్డెన్స్‌లో మల్లయోధులు పుండలిక్ దాదా, కృష్ణా నవీలపై హరిశ్చంద్ర శేఖరం బట్వడేకర్ డాక్యు మెంటరీని చిత్రీకరించారు. అధికారికంగా ఇది భారత దేశంలో నిర్మితమైన మొదటి డాక్యుమెంటరీగా పిలవబడుతోంది. మాస్కో, జర్మనీలో కదిలే చిత్రాలపై చదివొచ్చిన డి.జి. టెండుల్కర్, చిత్ర సంస్కృతి గురించి చదువుకున్న కె.ఎస్. హిరేల్కర్ 1930ల్లో డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో నూతన అంశాలను పరిచయం చేశారు. దానితో భారతదేశంలో డాక్యుమెంటరీ ఉద్యమానికి పునాది వేసినట్టయ్యింది.

మండలంలోని దేవరకొండ దగ్గర ఒక గిరిజన ప్రాంతంలో ఎన్నో యేళ్ళుగా ఆడపిల్లలు పుట్టిన వెంటనే అమ్ముకోవటమో, పారేయటమో చేస్తున్నారు. అమ్మటం, వదిలేయటంతో ఆగక కొందరు కడుపున పుట్టిన ఆడపిల్లలను చంపేస్తున్నారు. అలాంటి పరిస్థితులను నియంత్రించటానికి ప్రభుత్వం, ఇతర సంస్థలతో కలిసి ఏర్పాటుచేసిన 'ఊయల' ఆర్గనైజేషన్ కృషిని, ఇతర స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సహాయాన్ని తెలియపరుస్తూ ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. పిల్లల తల్లులనూ, స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసేవారిని ఇంటర్వ్యూ చేస్తూ, వాయిస్ ఓవర్‌తో కొనసాగే ఈ డాక్యుమెంటరీ సమాజంలో మూలాల నుంచి అర్థం చేసుకోవల్సిన సమస్యలను తెలియజేస్తుంది. సతీష్ చౌదరీ చంద్ర రూపొందించిన డాక్యుమెంటరీ 'హ్యూమానిటీ'. రోడ్డుపైన జీవితం కొనసాగిస్తూ 'పిచ్చివారిలా' బతుకుతున్న వారి గురించి ప్రజలను అభిప్రాయాలు అడగటంతో మొదలయ్యే ఈ డాక్యుమెంటరీ, తన పేరడిగితే "RYKNG" అని చెప్పే 'పిచ్చివాడి'ని తీసుకెళ్ళి, స్నానం చేయించి, బట్టలిచ్చి సురక్షితమైన గృహానికి పంపటంతో ముగుస్తుంది.

విద్యుతోనే విజ్ఞానం

కొన్ని డాక్యుమెంటరీలు ప్రభుత్వాల అభివృద్ధిని, స్థితిగతులనూ తెలియపరిచే విధంగా రూపొందించబడ్డాయి. జాతీయ నాయకులు, రాష్ట్రాల భిన్నత్వాన్ని వివరిస్తూ కూడా డాక్యుమెంటరీలు తీశారు. తుమ్మల నర్సింహారెడ్డి రూపొందించిన 'ఏపి స్కూల్ ఎడ్యుకేషన్' డాక్యుమెంటరీ అవిభాజిత ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల పనితీరును వివరిస్తుంది. కొన్ని కారణాల రీత్యా వెనకబడుతున్న ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడుతున్న వైనాన్ని, దానికోసమై ప్రభుత్వాలు తీసుకుంటున్న జాగ్రత్తలపై డాక్యుమెంటరీ రూపొందించారు. దానిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను తెలియపరుస్తూ, పాఠశాల విధినిర్వహణా చిత్రాలతో పాటు వాయిస్‌ఓవర్‌తో డాక్యుమెంటరీ సాగుతుంది. ఒబ్బని నాగరాజు రూపొందించిన 'డా. బి.ఆర్. అంబేద్కర్' డాక్యుమెంటరీ భారతదేశ రాజకీయాల్లో పేర్కొనదగిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్తా అంబేద్కర్ రాజకీయ ప్రస్థానాన్ని తెలియజేస్తూ కొనసాగుతుంది. అంబేద్కర్‌కు సంబంధించిన ఫోటోలను చూపిస్తూ వాయిస్ ఓవర్, మధ్యమధ్యలో అంబేద్కర్‌పై రాసిన పాపులర్ పాటల ప్లేబ్యాక్‌లో డాక్యుమెంటరీ నడుస్తుంది. అంబేద్కరుకు గాంధీకి మధ్యనున్న రాజకీయ విభేదాలను తెలుపుతూ కొనసాగే ఈ డాక్యుమెంటరీ చారిత్రక రాజకీయాలపై ఆసక్తిని రేకెత్తిస్తుంది. బ్రిటీష్ అధికారంలో దళితులకు ఓటు హక్కు వచ్చినప్పుడు, దానిని వ్యతిరేకిస్తూ ఎరవాడ జైల్లో



గాంధీ ఆమరణ నిరాహారదీక్ష చేయటం వంటి కీలకాంశాలు లేవనెత్తారు. అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూకోడ్ బిల్లుకు మద్దతుగా దుర్గాభాయి దేశ్‌ముఖ్ ఉద్యమం చేసినా కూడా అప్పటి ప్రభుత్వం ఆ బిల్లును అంగీకరించనందుకు అంబేద్కర్ మంత్రి పదవికి రాజీనామా చేసిన ఘట్టాల వంటి దేశ రాజకీయాలను వివరిస్తూ ఈ డాక్యుమెంటరీ రూపొందించారు. సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ ఆర్.విద్యాసాగర్ రావు వ్యాఖ్యాతగా ఉన్న డాక్యుమెంటరీ 'తెలంగాణా కథ'. అవిభాజిత ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ఎదుర్కొన్న సమస్యలను వివరిస్తుంది ఈ డాక్యుమెంటరీ. ముఖ్యంగా నీటికి సంబంధించిన సమస్యను లెక్కలతో విశ్లేషించి సవివరంగా అందిస్తారు. విద్యాసాగర్ వాటర్ కమిషన్‌లో రిటైర్డ్ అధికారి కనుక ఆయన మాటలు అధికారికంగా ఉంటాయని భావించి ఆయనను వ్యాఖ్యాతగా ఉంచారని తెలుస్తుంది. బాలాజీ కమ్మినేని రూపొందించిన "గురజాడలు" డాక్యుమెంటరీ తెలుగు జాతి గర్వించదగ్గ సారస్వత మహర్షి గురజాడ అప్పారావు ఔన్నత్యాన్ని చాటుతూ రూపొందించబడింది.

మనసు ఫౌండేషన్ నిర్మించిన ఈ డాక్యుమెంటరీలో ప్రస్తుత తెలుగు కవులు, సాహిత్య ప్రముఖులు గురజాడపై, ఆయన రచనలపై వారివారి అభిప్రాయాలను తెలియపరుస్తారు. గురజాడవారి పుట్టుక నుంచి పరమపదించినంత వరకూ ఆయన జీవితంలో ఘట్టాలను, ఆయన సాహిత్య దృష్టిని ప్రముఖుల ద్వారా తెలియజేస్తుందీ డాక్యుమెంటరీ.

కాదోయ్ ఏదీ అనర్హం...

శ్రీశ్రీ చెప్పిన కవితే కాదు డాక్యుమెంటరీ కూడా ఏ వస్తువునైనా తనలో ఇముడ్చుకోగలదు. వ్యక్తి నుంచి వ్యవస్థ వరకూ ఎలాంటి విషయాన్నైనా, ఏ విధమైన వస్తువునైనా డాక్యుమెంట్ చేయవచ్చు. తెలుగులో వచ్చిన డాక్యుమెంటరీలు వివిధ వస్తువుతో, నూతన ఆలోచనను మిళితం చేసుకుని హుషారుగా సాగుతున్నాయి. హరేంద్రనాథ్ తీసిన 'పల్లెటూరు' డాక్యుమెంటరీ మాటలు లేకుండా కేవలం చిత్రాలతోనే ఒక పల్లెటూరు వాతావరణాన్ని సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ చూపించటం కనులవిందు చేస్తుంది. అలాగే తెలుగు యూనివర్సిటీ విద్యార్థులు తీసిన 'శాటిస్‌ఫ్యాక్షన్' డాక్యుమెంటరీ మనుషులకు తృప్తి ఉందా? లేదా? అనే ప్రశ్నను శోధిస్తూ అనేక మందిని విచారిస్తుంది. నిఖిలేష్ రూపొందించిన ఈ చిత్రం అందరూ వాళ్ళు చేస్తున్న పనుల్లో ఎంత వరకూ తృప్తి చెందుతున్నారనే విషయాన్ని విశదపరుస్తుంది. జగన్నాథరావు తీసిన 'డిస్ అడ్వాంటేజెస్ ఆఫ్ స్మోకింగ్' ఖమ్మం నగరంలో పెరిగిపోతున్న పొగాకు వాడకం, దాని వలన కలుగుతున్న అనర్థాలను వివరిస్తుంది. మధ్యమధ్యలో డాక్టర్ల అభిప్రాయాలను కూడా తెలియజేస్తూ ఆలోచింపజేస్తుంది. రవివర్మ తీసిన 'హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్' రోడ్డు ప్రయాణికులను సంరక్షించే దిశలో వారు పడుతున్న పాట్లను తెలియజేస్తుంది. గణేష్ సాయి ధీరజ్ రూపొందించిన 'హోలీ వార్ ఎటాక్స్ ఆన్ ఇండియా' భారతదేశంలో జలియన్ వాలాబాగ్ ఉదంతం నుంచి జరిగిన అఘాయిత్యాలను వివరిస్తుంది. సుంకర హరీష్ తీసిన 'పులికాట్ సరస్సు' డాక్యుమెంటరీ పర్యావరణంతో ప్రజలకున్న అనుబంధాన్ని తెలియజేస్తుంది. నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు వైభవాన్ని, ప్రస్తుతం ఉన్న దీన స్థితిని విశదపరుస్తుంది. పూలంటి సతీష్ రూపొందించిన 'చిందు యక్షగానం' డాక్యుమెంటరీ 2000 సంవత్సరాల తెలుగు జానపద నృత్యరూపకం గొప్పతనాన్ని తెలుపుతుంది. యక్షగానంలో భాగాలు, కళాకారులు, వారి కులం, ప్రదర్శనలో వాడే దుస్తులు, కథలు, గేయాలు, ఆభరణాలతో పాటుగా కళాకారుల జీవితాలు, కళాపోషణ గురించి చక్కగా చెపుంది. విష్ణురాజ్ తీసిన 'కూచిపూడి, ది విలేజ్ ఆఫ్ డాన్స్'లో కూచిపూడి నాట్యం జన్మించిన గ్రామం విశేషాలను వివరిస్తారు. విక్రమ్ తీసిన 'ది అగ్రికల్చర్ ఫార్మర్',



జాన్ గ్రీర్‌సన్

ఫాదర్ ఆఫ్ డాక్యుమెంటరీ

1900 సంవత్సరానికి ముందు ఒక సంఘటనను మాత్రమే అంటే ఒకటే షాట్‌ను చిత్రీకరించేవారు. ఉదాహరణకు ఒక ట్రైన్ స్టేషన్‌లోకి రావటం, ఓడ వచ్చి ఒడ్డున ఆగటం, ఫ్యాక్టరీ వర్కర్లందరూ పనైపోయిన తర్వాత బయటకు వస్తుండటం లాంటి ఏకకాల సంఘటనలు. ల్యూమీయర్ బ్రదర్స్ తీసిన మొదటి చిత్రం వాళ్ళ కుటుంబం డైనింగ్ టేబుల్‌పై కూర్చుని ఒక చిన్నారికి తినిపించటం. అప్పటి సాంకేతిక పరిజ్ఞానం వలన ఇవన్నీ ఒక నిమిషం కంటే తక్కువ నిడివిగలవే. వీటిని 'నిజ' చిత్రాలు అని పిలిచారు. 1926 వరకు డాక్యుమెంటరీ అనే పదం ఎక్కడా వాడ లేదు. డాక్యుమెంటరీ అనే పదాన్ని ఉపయోగించింది స్కాట్‌లాండ్ డాక్యుమెంటరీ చిత్రకారుడు జాన్ గ్రీర్‌సన్ అని భావిస్తారు. 'ది మూవీ గోయర్' అనే పేరుతో ఫిబ్రవరి 8, 1926లో న్యూయార్క్ సన్‌లో తాను రాసిన రాబర్ట్ ఫ్లర్టీస్ సినిమా 'మోనా' (1926) రివ్యూలో మొదటిసారి ఈ పదాన్ని వాడారు.



సినిమావాళ్ళ డాక్యులు

దేశ సినీ గమనంలో విప్లవాత్మక వైనే ట్రెండ్‌ను సృష్టించి వదిలిన విలక్షణ విజయసారథి రాంగోపాల్ వర్మ. ఆయన రూపొందించిన చిత్రం 'శివ' ఆ చిత్రం రిలీజ్ అయ్యి 25 సంవత్సరాల సందర్భంలో సిరాశ్రీ వాఖ్యాతగా రూపొందించబడింది 'ఎక్స్‌ప్లోరింగ్ శివ'. తెలుగులో గొప్పగా తీయబడిన అతి తక్కువ డాక్యుమెంటరీల్లో ఇది ఒకటి. అలాగే సినిమా పరిశ్రమకు సంబంధించి కొన్ని డాక్యుమెంట్రీలు వచ్చాయి. ప్రముఖ సినిమా డైరెక్టరైన మధుసూదనరావుపై కె. ప్రసన్న కుమార్ తీసిన 'విక్టరీ మధుసూదనరావు'లో సినిమా ప్రముఖులు మధుగారిపై వారి అభిప్రాయాలను తెలియజేస్తారు. సి.హెచ్. స్వరూప్ తన అభిమాన డైరెక్టర్ పూరీజగన్నాథ్‌పై తీసిన ఫోటో డాక్యుమెంటరీ 'పూరీజగన్నాథ్, ఎ ఫ్యాన్ డాక్యుమెంటరీ', అదేవిధంగా ప్రొఫెసర్ మోహన మురళి వ్యాఖ్యాతగా ఉండి రూపొందించిన 'కాంచనమాల' కూడా ఒక ఫ్యాన్స్ డాక్యుమెంటరీగా చెప్పుకోవచ్చు. 'కాంచనమాల'లో తెలుగు సినీ పరిశ్రమపై కాంచనమాల ముద్రతో పాటు, ఒక సెలబ్రిటీగా ఆమె ప్రభావం సమాజంపై ఎలా వుండేది అనే విషయాన్ని వినసొంపుగా వివరించారు.

డాక్యుమెంటరీల్లో వైవిధ్యం

డాక్యుమెంటరీలు అన్ని ఒకేలా ఉండవు. ఎంచుకునే విషయాన్ని బట్టి, చిత్రించే విధానాన్ని బట్టి డాక్యుమెంటరీల్లో కొన్ని రకాలను గుర్తించారు. అమెరికాకు చెందిన బిల్ నికోలస్ అందరూ ఒప్పుకున్న ఆరు వైవిధ్యమైన డాక్యుమెంటరీ రూపాలను విశదీకరించాడు. డాక్యుమెంటరీలో ఉన్న కొన్ని విశిష్ట లక్షణాలను, సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ విభజన చేశారు.

పొయిటిక్ డాక్యుమెంటరీ: విషయం కళాత్మక వ్యక్తీకరణగా చెప్పవచ్చు. డాక్యుమెంటరీలో భాగస్తులైన వ్యక్తుల ఇంటర్వ్యూ ఇచ్చేవారు, డాక్యుమెంటరీని ప్రజెంట్ చేసేవారికి సంబంధించిన వ్యక్తిగత విషయాన్ని అంశంగా తీసుకుంటారు.

అబ్జర్వేషనల్ డాక్యుమెంటరీ: ఇక్కడ ఫిల్మ్‌మేకర్ తటస్థంగా ఉంటారు. ఒక విషయాన్ని బయట వ్యక్తిగా, బయట నుంచి గమనిస్తారన్న మాట. జీవితం అనేది జీవించటం, గమనించటంపై సాగుతుంటుంది. కనుక వివిధ సందర్భాలలో మనుషులు లేదా పశుపక్ష్యాదులు ఏవిధంగా స్పందిస్తాయో చూడటమే దీని ఉద్దేశం. ఈ చిత్రీకరణలో ముందుగా రిహార్సల్ చేయటానికి కుదరదు. కాబట్టి కెమేరా సిబ్బంది త్వరగా పని పూర్తిచేసుకోవాలి. అందువలన ఒక్కోసారి ఫుటేజ్ వణికినట్లు ఉండే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఇలాంటివి వెల్డ్‌లైఫ్ డాక్యుమెంట్ చేసేటప్పుడు జరుగుతాయి.

రిఫ్లెక్సివ్ డాక్యుమెంటరీ: ఇక్కడ ప్రేక్షకులు డాక్యుమెంటరీలో జరుగుతున్న వాటితో నిమగ్నమై ఉంటారు. ఇది నిర్మాణాత్మకమైన డాక్యుమెంటరీ స్వభావాన్ని తెలియజేస్తుంది. అంటే కేవలం నిజం మాత్రమే చూపించటం కాదు, 'ఒక' నిజం యొక్క నిర్మాణాన్ని కూడా చూపించటం. ఇంకొక మాటలో చెప్పాలంటే 'పూర్తిగా నిజం కాకపోవచ్చు కానీ నిజం'. ఇక్కడ ప్రేక్షకులు జరిగే ప్రక్రియ గురించి ముందుగా తెలియజేయబడతారు. ఎడిటింగ్, సౌండ్, రికార్డింగ్ గురించిన వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది.

ఎక్స్‌పోజిటరీ డాక్యుమెంటరీలను నాన్-ఫిక్షన్ చిత్రాలుగా పిలవచ్చు. అక్కడ ప్రేక్షకులకు ప్రత్యక్షంగా అందుబాటులో ఉంటారు. ఇక్కడ తార్కికవాదనతో పాటు జరుగుతున్న దాన్ని నొక్కిచెబుతున్న వాయిస్‌ఓవర్ కథను నడిపిస్తుంది. పార్టిస్పేటరీ డాక్యుమెంటరీ చిత్రీకరణలో ఫిల్మ్‌మేకర్ కూడా ఉంటారు. పర్ఫామేటీవ్ డాక్యుమెంటరీలో వ్యక్తిగత అనుభవాలలు, భావోద్వేగాలకు సంబంధించిన అంశాలను గుర్తిస్తారు. మనం చూసే డాక్యుమెంటరీలను నికోలస్ చెప్పిన ఈ ఆరు కోణాల నుంచి గమనించినట్లయితే వాటి విశ్లేషణ తేలికౌతుంది.

వాసు కొండేటి తీసిన 'అగ్రికల్చర్' వ్యవసాయ ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. వ్యవసాయం ఆవశ్యకతను తెలియజేస్తూ, ప్రస్తుతం వ్యవసాయం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను, రైతుల జీవనం, రైతులు పడుతున్న కష్టాలను వివరిస్తాయి. ఎమ్‌జెఎస్ శ్రీకాంత్ రూపొందించిన షి ఈజ్ ఆడవాళ్ళు ప్రతిరోజూ పడుతున్న హింసపై ప్రజల అభిప్రాయాలను తెలియజేస్తుంది. పవన్ రజనీ రూపొందించిన డాక్యుమెంట్రీ 'గ్రహణం'. ఢిల్లీ గ్యాంగ్ రేప్ నేపథ్యంతో వచ్చింది. రేప్ చేయాలనే ఆలోచన రావటానికి సంస్కృతి ఎంతవరకూ ప్రభావం చూపుతుందనే విషయంపై ప్రజల అభిప్రాయాలను సేకరించి సమర్పించారు. రేప్ చేసినవారికి ఎలాంటి శిక్షలు వేయాలి వంటి ప్రశ్నలను సంధించి అందర్నీ ఆలోచింపజేస్తుంది.

ప్రత్యేక చానళ్ళు

1990ల్లో ఊపందుకున్న శాటిలైట్ టెలివిజన్ వచ్చేటంత వరకూ ప్రభుత్వంచే ప్రసారంచేయబడిన రెండు దూరదర్శన్ జాతీయ చానళ్ళలోనే డాక్యుమెంటరీలు ప్రసారం అయ్యేవి. భారతదేశంలో ఆ తర్వాత 1995 ఆగస్టులో డిస్కవరీ చానల్, అదేవిధంగా 1998లో నేషనల్ జాగ్రఫిక్ ఛానల్ రావటంతో మనవాళ్ళు మరింత ఉత్సాహంతో డాక్యుమెంటరీలను రూపొందించారు. డిస్కవరీ చానల్ ద్వారా ప్రారంభించబడిన యానిమల్ ప్లానెట్, అదే విధంగా 2004 అక్టోబర్‌లో వచ్చిన లైఫ్ స్టైల్ చానల్ మరిన్ని కొత్త మార్గాలను చూపించాయి. భారతదేశంలో పెద్ద టీవి నెట్‌వర్క్ చానల్ అయిన జీ టీవి 'ఖోజ్' అనే పేరుతో డాక్యుమెంటరీ ఛానల్‌ను రూపకల్పన చేసింది.

ప్రోత్సాహకాలు

ప్రసార మాధ్యమాలతో పాటు ఇండిపెండెంట్ డాక్యుమెంటరీ చిత్రాలకు సహకారంగా పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ ట్రస్ట్ (పి.ఎస్.బి.టి) ఏర్పాటయ్యింది. ఈ ట్రస్ట్‌కు ఫోర్డ్ ఫౌండేషన్, దూరదర్శన్ నుంచి నిధులు సమకూరుతాయి. పి.ఎస్.బి.టి వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన చిత్ర నిర్మాత రాజీవ్ మెహ్రోత్రా భారత డాక్యుమెంటరీలు ఉండాల్సిన తీరును విశదపర్చాడు. "పిఎస్‌బిటీకి సంచలనాలు, కేవలం ఘర్షణలు మాత్రమే అవసరంలేదు. అవి టెలివిజన్ రేటింగ్స్‌లో కూడా కనపడతాయి. కావలిసింది నిశ్చలమైనటువంటివి, పరిగణనలోకి తీసుకోగల్గిన అంతర్గత నిజాలు, ప్రస్తుత సంకట స్థితులు. వాటితో పాటు మన వారసత్వ సంపదను వివరించే విశేషాలుగల విలువైన అంశాలను చిత్రీకరించాలి" అన్నారు. కొత్త ఆలోచనలను తక్కువ ఖర్చుతో చిత్రించేవారిని పిఎస్‌బిటి ప్రోత్సహిస్తుంది.

తెలుగులో డాక్యుమెంటరీలు వచ్చినా, వస్తున్నా దేశంలోని మిగతా ప్రముఖ భాషల డాక్యుమెంటరీలతో పోల్చుకుంటే మరింత అభివృద్ధి చెందాలని అనిపిస్తుంది. టెక్నాలజీలో మార్పుల వలన ఒక చిత్రాన్ని నిర్మించటం మరింత సులువైంది. అయితే రూపొందించిన ఆ చిత్రానికి ప్రేక్షకులను కూడా ముందుగానే ఏర్పరుచుకుని నిర్మించటం, ప్రేక్షకుల విస్తృతిని దృష్టిలో ఉంచుకొని చాలామంది వారు తీస్తున్న డాక్యుమెంటరీలను ఆంగ్లంలో రూపొందించటం వలన తెలుగులో జరగవలసిన అభివృద్ధి జరగటం లేదు. యువత రూపొందిస్తున్న డాక్యుమెంటరీలు కొత్త ఆలోచనలతో సరికొత్తగా జీవం పోసుకుంటున్నాయి. అయితే క్వాలిటీ టెక్నాలజీతో డాక్యుమెంటరీలు తీసేవారు ఇంగ్లీషు, హిందీ భాషలను ఆశ్రయించటం వలన చాలా వరకూ తెలుగు డాక్యుమెంటరీల అభివృద్ధి కుంటుపడుతోంది. కొందరికి మంచి ఆలోచనలు ఉన్నా టెక్నాలజీ అందుబాటులో లేకపోవటం దురదృష్టకరం. మరికొందరు తీస్తున్న చిత్రాల ప్రాముఖ్యతను గుర్తించకపోవటం వలన అశ్రద్ధతో కూడిన చిత్రాలు బయటకొస్తున్నాయి. ఏదేమైనాగాని తెలుగులో ఎక్కువగా డాక్యుమెంట్రీలు రూపొందించి మన సంస్కృతిని చరిత్రలో నిలపటానికి మరిన్ని ప్రయత్నాలు జరగాలని ఆశిద్దాం. ✦





రోలర్ కోస్టర్ సర్వింగ్

ఏదైనా రెస్టారెంట్‌కెళితే మెనూ ఆర్డర్ ఇచ్చాక పదార్థాల్ని తెచ్చే వెయిటర్ కోసం నలువైపులా చూస్తుంటాం. బ్రిటిష్ థీమ్ పార్క్ ఆల్టన్ టవర్స్‌లోని రోలర్ కోస్టర్ రెస్టారెంట్‌లో ఆర్డర్ చేసిన పదార్థాల కోసం పైకి చూస్తుంటారు. అక్కడ ఆర్డర్ ఎలా చేయాలో చెప్పేందుకు మాత్రమే మనుషులుంటారు. ఆహార పదార్థాలు అందించేది మాత్రం రోలర్ కోస్టర్లే. వంపులు వంపులుగా ఉండే మార్గంలో గిరగిరా తిరుగుతూ వేడివేడిగా ఆహారం మన టేబుల్ ముందుకొచ్చేస్తుంది. ఒక్కో రోలర్ దగ్గరా మూడు టేబుల్స్ ఉంటాయి. వచ్చిన పదార్థాలు మనవా కావా అని సరిచూసుకునేందుకు టేబుల్ నెంబర్ రాసున్న ఒక చిన్న ఫ్లాగ్‌ను పదార్థాలు ఉంచిన డిష్‌తో జతచేసి పంపుతారు.

శ్మశానంలో పిక్నిక్

పెద్దల జ్ఞాపకార్థం ప్రతి ఏటా శ్మశానంలో పిక్‌నిక్‌ని జరుపుకుంటారు పాంటిక్స్. 1914-1922 మధ్య కాలంలో నల్ల సముద్రం తీర ప్రాంతాల్లో నివసించిన ఒక పురాతన గ్రీకు తెగ పాంటిక్స్. ఒకప్పుడు దాదాపు 3 లక్షలా 50 వేల జనాభాగా ఉన్న పాంటిక్స్ గ్రీకు ఊచకోతతో వేలాదిగా మరణించారు. బతికున్న కొద్దిమందీ గ్రీస్‌లోని వివిధ ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్లిపోయారు. ప్రస్తుతం పాంటిక్స్ గ్రీస్‌లో అతి చిన్న తెగగా ఉన్నా ఇప్పటికీ తమ సంప్రదాయాల్ని మాత్రం మర్చిపోలేదు. ఈస్టర్ తర్వాత ఆదివారం రిజానా గ్రామంలోని స్థానిక శ్మశానస్థలి వద్దకి పాంటిక్ గ్రీక్ కుటుంబాలు సాంప్రదాయ వంటకాలు, వోడ్కా, కొవ్వొత్తులు, పూలతోపాటు టేబుల్, కుర్చీలతో కుటుంబ సమేతంగా అక్కడికి చేరుకుంటారు. వారి కుటుంబీకుల సమాధుల వద్ద గౌరవ విందు చేసి ఆ రోజంతా అక్కడే గడిపేస్తారు. కుటుంబంలోని ఏ ఒక్కరూ కంటతడి పెట్టకూడదనేది వారి ఆచారం.

వెదురు బొంగే పడవ

చైనాలోని హ్యాంగ్జౌ ప్రాంతానికి చెందిన ఫాంగ్ షుయున్ తాను ఎక్కాల్సిన పడవ వెళ్లిపోతే మరో పడవ కోసం అస్సలు ఎదురు చూడడు. వెంటనే ఒక రెండు వెదురు బొంగులతో ప్రయాణం మొదలెట్టేస్తాడు. ఇలా వెదురు బొంగుపై నిమిషానికి 100 నుండి 164 అడుగుల వేగంతో సాగిపోతుండే ఫాంగ్‌ని చూసిన వారెవరైనా నోరెళ్లబెడతారు. 23 అడుగుల పొడవుండే వెదురు బొంగుపై కాలుపెట్టి మరో కాలు బొటన వేలుతో బొంగు తిరిగిపోకుండా అపుతుంటాడు. 13 అడుగుల మరో వెదురు కర్రను తెడ్డుగా ఉపయోగిస్తాడు. రెండేళ్ల క్రితం ఒక రోజు పని నుండి ఇంటికి తిరిగొస్తున్నప్పుడు ఫాంగ్ ఎక్కాల్సిన ఆఖరి పడవని మిస్సయ్యాడు. అప్పుడు నీటిలో ఒక వెదురు బొంగు కనిపించడంతో దానిపై ఒడ్డు దాటేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. అంతటితో వదిలేయకుండా ప్రయత్నాల్ని కొనసాగించి పట్టు సాధించేశాడు.

భాషని మార్చగల పైలట్

ఇతర భాషల్ని మనకు తెలిసిన భాషలోకి మార్చగల ఒక చిన్న పరికరం పైలట్. చెవుల్లో ఇమిడిపోయే ఈ పరికరాన్ని న్యూయార్క్‌లోని వెవర్లీ కంపెనీ రూపొందించింది. బ్లూటూత్ నమూనాలో ఉండే రెండు ఇయర్ పీస్‌లని ధరించడంతో పాటు మన స్మార్ట్‌ఫోన్‌లో పైలట్ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్ అవతలి వారు మాట్లాడే భాషని మనకు తెలిసిన భాషలోకి మారుస్తుంది. చెవికి ధరించిన ఇయర్ పీస్ సాయంతో వారు మాట్లాడిందంతా స్పష్టంగా మనకి తెలిసిన భాషలో వినొచ్చు. ఇప్పటికే ఇంగ్లీష్, స్పానిష్, ఫ్రెంచ్, ఇటాలియన్ భాషలతో త్వరలో మార్కెట్‌లోకి రానున్న ఈ పరికరం కోసం ఇప్పటికే కొన్ని లక్షల మంది ఎదురు చూస్తున్నారు. వీటిని మార్కెట్లోకి ఎపుడు తెస్తారో మాత్రం ఇంకా ప్రకటించలేదు.



తేలియాడే ద్వీపం

వినూత్నం

తేలాడే ఓ దీవి మెక్సికో తీరం వద్ద ఉంది. దీనంటే పెద్దదేం కాదు. సహజంగా ఏర్పడింది కూడా కాదు. ఆ దీవిని కట్టుకున్నాడో పర్యావరణ ప్రేమికుడు రిచర్డ్ సోవా. రిషి అని ముద్దుపేరున్న ఈయన వాడి పారేసిన ప్లాస్టిక్ బాటిళ్లతో దీన్ని కట్టేశాడు. ఈ చిట్టి దీవిలో ఓ ఇల్లు, కొన్ని చెట్లు, మొక్కలు, పడవ నిలిపే చోటు ఇంకొంత ఖాళీ ప్రదేశం ఉంటాయి. మొత్తం బరువంతా ప్లాస్టిక్ బాటిళ్ల మీదే ఉంటుంది. ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే...

ఇంగ్లండ్‌లోని మిడిల్స్‌బరోకు చెందిన రిచర్డ్ సోవాది వడ్రంగుల కుటుంబం. వంట గదులకు కావాల్సిన పనుల్ని చేస్తుండేది. వృత్తిపరంగా జర్మనీకి మారిన కుటుంబంతోపాటు రిచర్డ్ కూడా దేశాలు తిరగడం మొదలెట్టాడు. అంత పనితనం లేకపోవడంతో రిచర్డ్ ప్రకృతి చిత్రాలు గీస్తూ సంపాదించేవాడు. అదే సమయంలో వైవాహిక సమస్యల వల్ల భార్యాపిల్లలు ఆయన్ను వదిలి ఇంగ్లండ్‌కు వెళ్లిపోయారు. కుదేలైన రిచర్డ్ దేశాలు తిరగడం మొదలెట్టాడు. వీధుల్లో చిత్రాలు గీస్తూ, సంగీతం వినిపిస్తూ పొట్ట నింపుకునేవాడు. కొన్నాళ్లకు అమెరికా చేరుకుని 1996 నాటికి మెక్సికో వెళ్లాడు. సాన్ పెడ్రో పోచుల్టా ప్రాంతంలోని జిపోలైట్ అనే సముద్ర తీరానికి చేరుకున్నాడు. వేల ఏళ్ల క్రితం అక్కడి పూర్వీకులైన ఆజ్‌టెక్‌లు తేలాడే ద్వీపాల్ని నిర్మించేవారని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. తాను అలా చేయాలనే ఆలోచన కలిగింది. ఎలా తయారు చేయాలనే ఆలోచనలు ఆయన ఒంటరితనాన్ని తరిమేశాయి. కొత్త దృక్పథాన్ని కలిగించాయి. తొలిసారి సంతోష ఛాయలు కనిపించాయి. అంతే ఇక పూర్తిగా ఆ ప్రాజెక్ట్‌కు అంకితమైపోయాడు. ఇల్లు ఇతర నిర్మాణాలు, వస్తువులు తేలాడేందుకు ఏం ఉపయోగించాలని ఆలోచిస్తుండగా సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సమూహాల చేటు గురించి తెలిసింది. సముద్రాన్ని కలుషితం చేస్తున్న వీటిని ఉపయోగిస్తే అటు పర్యావరణానికి మేలు కలుగుతుందని వేలాది ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించాడు. వాటిని వలల్లోకి నింపి ప్లైవుడ్ ఫ్రేమ్‌లో అమర్చాడు. ఇలా బేస్ ఏర్పాటు చేస్తుండగానే దగ్గరి గ్రామానికి చెందిన ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదో రకంగా రిచర్డ్‌కు మేలే చేసింది. ఆ బీచ్‌ను వదిలివెళ్లిపోయిన రెండు రోజులకే పాలిన్ తుఫాన్ ఆ ప్రాంతాన్ని కకావికలం చేసింది. కొన్నాళ్ల తర్వాత ఈసారి మెక్సికోలోని కరీబియన్ సముద్ర తీరంలోని ప్యూర్టో అవెంచురాస్ వద్ద ప్రయత్నం మొదలెట్టాడు. వాడిపారేసిన ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి వెదురు, ప్లైవుడ్ ఫ్రేమ్‌లో అమర్చి పైన ఇసుకను పొరలు పొరలుగా వేశాడు. ఆ తర్వాత మట్టి పోసి కొన్ని రకాల మొక్కల్ని పెంచాడు. వాటి వేళ్లు బాటిళ్లకు పెనవేసుకుపోయి చెల్లా చెదరుకాకుండా చేశాయి. ఈత కలపతో ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. ఇక్కడి స్థానికులు మాత్రం ఆయన ప్రయత్నానికి వెన్నుదన్నుగా నిలిచారు. నాలుగేళ్ల పాటు శ్రమించి తన నిర్మాణ కౌశలంతో రెండంతస్తుల ఇంటిని నిర్మించాడు. కూరగాయ, పూల తోటలు కూడా పెంచాడు. మూడు వైపులా ప్రకృతిని ఆస్వాదించేందుకు బీచ్‌లాంటి ప్రదేశాల్ని వదిలాడు. కంపోస్టింగ్ టాయిలెట్ ద్వారా నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఈ మొత్తం తేలాడే నిర్మాణానికి స్పైరల్ ఐల్యాండ్ అని పేరు పెట్టుకున్నాడు. అంతా పూర్తయ్యాక దీని గురించి తెలుసుకున్న పర్యాటకులు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి తరలిరావడం మొదలైంది. స్థానికులకు ఇదో పెద్ద ఇబ్బందిగా మారింది. వారికి సమస్య కాకుండా రిచర్డ్ ఆ తేలాడే ద్వీపాన్ని పడవకు కట్టుకుని లాక్కెళ్లి ప్యూర్టో అవెంచురాస్ కాలువ వద్దకు గ్రామానికి దూరంగా చేర్చాడు. 2005లో ఎమిలీ తుఫాన్ వల్ల అది తుడుచుపెట్టుకు పోయింది. ఏడేళ్ల కష్టం కళ్లెదుటే నాశనమైంది.

స్పైరల్ నుంచి జాయ్..

బాధలో ఉన్న రిచర్డ్‌కు స్థానిక ఎకొలాజికల్ పార్క్ అధినేత ఆస్కార్ కాన్‌స్టాండ్స్ నుంచి ఓ ఓదార్పు మాట వినపడింది. ఆయన 20 వేల డాలర్లను అందజేయడమే కాక మరో 20 వేల డాలర్లను ఇతరుల చేత సాయమిప్పించాడు. మరో తేలియాడే ద్వీపాన్ని కట్టేందుకు సరంజామా సర్దేసి కాంకున్‌లోని ఐలా ముజెరెస్‌కు చేరాడు రిచర్డ్. సుమారు లక్ష పెట్ బాటిళ్లతో జోయ్‌క్సీ పేరిట నిర్మాణం చేపట్టాడు. స్పైరల్ దీవి కన్నా పెద్దగా ..ఓ సౌరశక్తి సాయంతో పనిచేసే జలపాతం, చిన్న నది (కాలువ)ని అదనంగా ఏర్పాటు చేశాడు. అప్పటికే రిచర్డ్ ద్వీపాల గురించి తెలిసిన చాలామంది ప్రపంచ నలుమూలలా నుంచి అక్కడకు చేరుకుని వలంటీర్లుగా సాయపడ్డారు. నిర్మాణానంతరం మెక్సికో ప్రభుత్వం రిచర్డ్ సేవల్ని గుర్తించి దానికి అధికారికంగా ఎకొలాజికల్ పడవగా గుర్తింపునిచ్చింది. ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దిన ఇంటీరియర్స్, గదులు ఆ ద్వీపానికి పర్యాటకుల తాకిడిని మరింత పెంచింది. దాని ద్వారా వచ్చే ఆదాయంతో మరిన్ని తేలియాడే ద్వీపాల్ని నిర్మించి ప్లాస్టిక్ బాటిళ్ల కాలుష్యాన్ని తగ్గించాలని రిచర్డ్ కృషి చేస్తున్నాడు.

✦



పడక గది

సేవ

కపడా బ్యాంక్

రోటీ.. కపడా.. మకాన్... ఈ పదాలు వినగానే పేదవాడి పాట్లు గుర్తొస్తాయి. ప్రపంచ జనాభా మెత్తం రోజంతా కష్టపడేది ఈ మూడింటి కోసమే అనడం తప్పు కాదేమో! మనలో చాలా మంది రోజు విడిచి రోజు ఒకే జత దుస్తుల్ని కట్టుకోడానికి ఇష్టపడరు. మరి కొందరు ఎప్పటికప్పుడు కొత్త రకం దుస్తుల్ని కొనుక్కున్నా ఇంకా లేటెస్ట్ ట్రెండ్స్‌ని ఫాలో కాలేకపోతున్నామంటూ ఫీలవుతుంటారు. కానీ పేదల పరిస్థితేంటి.. వారి కోసమే కపడా బ్యాంక్ పేరుతో దుస్తుల్ని అందించేందుకు ముందుకొచ్చాడు హారూన్ ముకతి ఇస్లామిక్ సంస్థ వ్యవస్థాపకుడు యూసుఫ్ ముకతి.

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో తాను ప్రారంభించిన 'రోటి బ్యాంక్' స్ఫూర్తితో ఇప్పుడు 'కపడా బ్యాంక్'ని ప్రారంభించాడు యూసుఫ్. గత సంవత్సరం డిసెంబరు 5న నెలకొల్పిన రోటి బ్యాంక్ ఎంతో మంది ఆకలి తీర్చగలిగింది. పదార్థాలు పాడవక ముందే ఎప్పటికప్పుడు తాజా ఆహారాన్ని పేదలకి పంచి పెడుతూ దేశంలోని మరిన్ని ప్రదేశాల్లో పేదల ఆకలి తీర్చే ఎన్నో రోటి బ్యాంకులకు ప్రేరణగా మారింది. ఆర్థిక పరంగా వెనుకబాటుతోపాటు, సరైన ఉపాధి లేక ఆహారాన్ని పొందలేని వారు కొందరైతే వయసు పైబడడంతో పనిచేయలేక, చేయిచాచి ఇతరుల్ని అడగటం ఇష్టంలేక పస్తులుండేవారు కొందరు. ఔరంగాబాద్‌లోని ముస్లిమ్ సామాజిక వర్గంలో ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నవారిని గుర్తించాడు యూసుఫ్. ఆహారం కోసం తన రోటి బ్యాంక్ వద్దకి వచ్చే పేదలు సరైన దుస్తులు కూడా లేక చలిలో వణుకుతూ కనిపించేవారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఆకలికి, చలికి తట్టుకోలేక వణుకుతుండటం ఆయన్ను ఎంతగానో కలచి వేసింది. ముస్లిం పేదలకే కాకుండా నగరంలోని పేదలందరికీ మరింతగా సాయపడాలనుకున్నాడు యూసుఫ్. దుస్తుల దుకాణాన్ని నడుపుతున్న యూసుఫ్ తొలుత తన దుకాణం నుంచే కొన్ని దుస్తుల్ని అందించాడు. చలి తీవ్రతకు తట్టుకోలేక అవస్థపడుతున్న వందలాది పేదలకు తను అందిచే వస్త్రాలు ఏమాత్రం సరిపోవని గుర్తించిన యూసుఫ్ హారూన్ ముకతి ఇస్లామిక్ సంస్థలోని సభ్యుల భాగస్వామ్యంతో 'కపడా బ్యాంక్'ని ప్రారంభించాడు. అందుకోసం తన సొంత ప్రాంతం నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి దుస్తులను సేకరించే పనిలో పడ్డాడు. కపడా బ్యాంక్ నెలకొల్పిన రెండు రోజుల్లో 600 జతల దుస్తులు సేకరించడం సంస్థ సభ్యులతోపాటు, యూసుఫ్‌కి ఆనందాన్నిచ్చింది. కపడా బ్యాంక్‌కు దుస్తుల్ని పంపే వారు ఎలాపడితే అలా దుస్తుల్ని పంపకుండా కొన్ని నియమాల్ని పాటించాల్సిందిగా కోరారు యూసుఫ్. పేదల కోసం అందించే దుస్తులు ముడత పడిపోయినవి, చిరిగినవి కాకుండా ఉండాలనేది యూసుఫ్ ఉద్దేశం.. ఉచితంగా అందించే దుస్తులైనా అవి వారికి పూర్తిగా ఉపయోగపడాలనేది అతని అభ్యర్థన. కపడా బ్యాంకుకు వచ్చే దుస్తుల్ని నేరుగా పేదలకి అందించకుండా వాటిలో ఉండే లోపాల్ని గుర్తించేందుకు కొందరు వలంటీర్లు పనిచేస్తారు. వివిధ రకాల దుస్తుల్లో లోపాల్ని సవరించి సైజుల వారీగా స్త్రీ, పురుషుల దుస్తుల్ని వేరు చేసి వాటిని శుభ్రపరిచేందుకు డ్రైక్లీన్‌కి పంపుతారు. శుభ్రపరిచిన దుస్తుల్ని ఇస్త్రీ చేసి ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి వాటిని ఒక వరుస క్రమంలో అమరుస్తారు. ఇవన్నీ చేయడానికి కొంత ఖర్చైనా పేదవారికి హుందాతనాన్ని అందించడం తమకు సంతోషాన్నిస్తుందంటారు యూసుఫ్. ఇక దుస్తుల కోసం వచ్చే పేదల వద్ద పచ్చ రేషన్ కార్డును పరిశీలించి వారి అడ్రసును నమోదు చేసుకుంటారు. దుస్తుల కోసం వస్తే అడ్రస్సేంటనే సందేహం రాకమానదు. అయితే ఈ ప్రక్రియంతా చేసేది ఇచ్చిన వారికే మళ్లీ ఇస్తే అవసరమున్న వారికి దుస్తులు అందవని. నివాసాలు లేకుండా రోడ్డుపైనే జీవిస్తున్న వారికి మాత్రం వలంటీర్లే స్వయంగా దుస్తుల్ని అందించి ఆదుకుంటారు. కపడా బ్యాంక్‌కి దుస్తులందించిన ఎంతో మంది ఇప్పుడు వారి వద్ద ఉన్న చెప్పులు, బూట్లు, స్వెటర్లు, దిండ్లు, రగ్గులు, బొంతలు, బెడ్‌షీట్‌లు ఇలా వివిధ రకాల వస్తువులు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు.

సమాజానికి సాయపడే దిశగా చేస్తున్న ప్రయత్నంలో ఇది రెండో అతి పెద్ద విజయంగా భావిస్తాడు యూసుఫ్. ఈ సంవత్సరం మహిళా సాధికారత కోసం హారూన్ ముకతి ఇస్లామిక్ సంస్థ ఒక ట్రెయినింగ్ సెంటర్‌ని ఏర్పాటు చేసి సుమారు 2000 మంది ఆడపిల్లలకి 15 వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణనిస్తూ ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తోంది.

✦

పచ్చగా పర్యావరణం

◆ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణా చర్యలు చేపట్టేందుకు, వాతావరణంపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఏటా జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటారు.

తెలుసా

◆ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 1972లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రవేశపెట్టింది.



◆ ప్రపంచవ్యాప్తంగా ఉండే మొక్కలు, కీటకాలు, జంతు జాతులు, సగానికి పైగా ఉష్ణమండల అడవుల్లో కనిపిస్తాయి.

◆ జీవవైవిధ్యం, విభిన్నమైన పర్యావరణ వ్యవస్థ భూమ్మీద తప్ప మరే ఇతర గ్రహాల్లో ఇప్పటికి కనిపించ లేదు.





◆ వ్యవసాయ, పారిశ్రామిక, గృహ అవసరాలు, పర్యావరణ అవసరాల కోసం అవసరమయ్యే నీరు దాదాపు 75 శాతం వరకు అటవీ, నదీ పరీవాహక ప్రాంతాలు, చిత్తడి నేలల నుండి లభిస్తోంది.

◆ ప్రపంచాన్ని ఉత్తమ స్థానంగా మార్చడానికి నిర్వహించే పరుగులో మీరూ భాగస్వామ్యులు కండి అనేది ఈ ఏడాది నినాదం.



◆ టాయిలెట్ పేపర్ తయారీ కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజూ 27 వేల చెట్లు నరికి వేయబడుతున్నాయి.

◆ కలప గుజ్జు నుండి తయారయ్యే కాగితాన్ని కేవలం ఆరు సార్లు మాత్రమే రీసైకిల్ చేయవచ్చు. తర్వాత వాటిలో ఉండే ఫైబర్ పట్టు కోల్పోవడంతో వాటిని ఎక్కువ సార్లు ఉపయోగించలేం.



◆ బీవర్స్ జంతువులు వాటి పారదర్శక కనురెప్పలతో నీటి లోపల కూడా చూడగలవు.

◆ ప్రపంచం మొత్తం మీదా 1200 జాతుల గబ్బిలాలున్నాయి. అయితే వాటిలో ఏ ఒక్కటీ గుడ్డిది కాదు. అది ఒక అపోహ మాత్రమే.

◆ జీవవైవిధ్య ప్రధాన కేంద్రాల్లో భారత దేశం ఒకటి.

◆ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం 80 శాతం ప్రజలు మొక్కలతో తయారు చేసే మందులపైనే ఆధారపడుతున్నారు.



◆ భూమిని పరిరక్షించడం తమ వంతు బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరూ సాధ్యమైనన్ని మొక్కల్ని నాటి పర్యావరణ పరిరక్షకులుగా మారాలి.

ఆలోచన రేకెత్తించే నవలలు

గత శతాబ్ది మధ్య కాలంలో పాఠకులకు ఆలోచనలు రేకెత్తించే, పఠనాసక్తి పెంపొందించే నవలలు రచించిన వారిలో జంపన చంద్ర శేఖరరావు ఒకరు. వ్యావహారిక భాషలో రచనలు చేయటమే నేరంగా పరిగణించే కాలంలో, పండితుల కోసమే రచనలు చేస్తున్న ఆ రోజుల్లో వాడుక భాషలో పుంఖాను పుంఖాలుగా రచనలు చేసి చదివింపచేశారు జంపన.

యాభై, అరవై దశకాలలో అనేక తెలుగు, తమిళ సినిమాలు నిర్మించి, దర్శకత్వం వహించారు ఈ నవలా రచయిత. ఆయన రచనలు ప్రచురించే క్రమంలో రెండవ నవలల సంపుటి ఇది. ఎనిమిది నవలలు ఇందులో ఉన్నాయి. 1940వ దశకంలో దేశంలో నెలకొన్న కరువు, మూఢనమ్మకాలు, చిరుద్యోగుల జీవితాలకు సంబంధించిన వాస్తవ పరిస్థితిని మనముందుంచారు.

జంపన నవలలు
రచయిత: జంపన చంద్రశేఖరరావు
పేజీలు: 312
వెల: 220/-
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

ఈ సంపుటిలో 'జీవితాశ', 'క్షామం' రెండు నవలలు 40వ దశకంలో బెంగాల్ ఇతర ప్రాంతాలలో వచ్చిన కరువుకు సంబంధించినవి. ఆకలి బాధలను ఎదుర్కొన్న ఆనాటి హృదయ విదారక

దృశ్యాలు కళ్ళ ముందు కదిలేటట్లు చేశారు. కాగా "జన్మ భూమి", "స్టూడెంట్" నవలలు ప్రేమ వైఫల్యాలకు సంబంధించినవి. కామం స్వార్థంతో కూడుకున్నదని, ప్రేమ స్వార్థరహితంగా ఉంటుందని రచయిత వివరణ.

'గుమస్తా' , "నెలజీతం" రెండు నవలలు మరోకోణం నుండి వివరిస్తుంది. ఏ ఆధారం లేక కొత్త వ్యాపారుల పై ఆధారపడిన గుమస్తాల జీవితాలు ఎదుగూ లేక అనేక అవమానాలు ఎదుర్కోవటాన్ని రచయిత వివరించారు.

'శాస్త్రాలెందుకు..?', 'మొక్కుబడి' రెండు నవలలు మూఢనమ్మకాలపై ఎక్కుపెట్టిన బాణాలు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఆనాటి సమాజం లో నెలకొన్న మూఢాచారాలు ప్రజలకు ఎలా ఆటంకంగా మారాయో ఈ నవలలు వివరిస్తాయి. ఆ కాలంలోనే ఇంత చక్కని వాడుక భాషను ఉపయోగించి రచయిత ముందు చూపును తెలుపుతుంది. డెబ్బైఅయిదేళ్ళు గడుస్తున్నా ఈ రచనలు సజీవతకు కారణమిదే.

- భవిష్య

సరోగసీకి సరైన అర్థం

'ఆకుపచ్చ విధ్వంసం' నవలతో నవలా రచయితగా ఆవిర్భవించిన శిరంశెట్టి కాంతారావు మరో అద్భుత రచన 'పూల కుండీలు'. కవి, కథకుడు, నవలాకారుడుగా అన్ని పార్శ్వాలను స్పృశించిన శిరంశెట్టి... 'పూలకుండీలు' నవల ద్వారా నిరుపేద అద్దె గర్భపు తల్లుల ఆక్రోశాన్ని అత్యంత హృద్యంగా చిత్రించారు. తొమ్మిది నెలల పేగు బంధపు ప్రతిరూపం ఎలా వుందో ఒక్కసారన్నా కళ్లారా చూసుకునే అవకాశం ఇవ్వకుండానే పూలకుండీల నుంచి వేరుచేసిన మొక్కల్లా క్షణాల్లో తల్లీ బిడ్డలను వేరేసి ఎగరేసుకుపోతారంటూ రచయిత తన ఆవేదనను వ్యక్తం చేస్తాడు. నవలా శీర్షిక కూడా అర్థవంతమైన ఎంపిక. పేదరికాన్ని ఆసరా చేసుకుని కొన్ని ఏజెన్సీలు పేదరాళ్ల జీవితాలతో ఆడుకుంటున్నాయి.

పేదరికాన్ని అడ్డుపెట్టుకొని మధ్య దళారీలు, వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ వంటి సంస్థలు పేదల రక్తాన్ని పీల్చుతూ.. వాళ్ల జీవితాలను ఎలా ఛిద్రం చేస్తారో కళ్లకు కట్టినట్లు వర్ణించారు. కథలోకి వెళితే... వృద్ధులైన తల్లిదండ్రులు, భార్య నలుగురు పిల్లలతో పెద్ద సంసారం ఎల్లయ్యది. ఏదోక కూలి పనిచేసే ఎల్లయ్యతో పాటు భార్య శాంతమ్మ కూడా నాలుగిళ్లలో పనిచేస్తూ సంసారాన్ని లాక్కొస్తుంటుంది. డాబా కట్టుకోవాలనే కోరికతో ఆర్ఎంపి లింగయ్య దగ్గర అప్పు చేస్తారు. ఇల్లు పూర్తి కాకపోగా, కుటుంబం గడవడమే కష్టమౌతుంది. పని కోసం ఎల్లయ్య బొంబాయి వెళతాడు. కుటుంబ పోషణకు గడవక అష్టకష్టాలు పడుతుంటారు. దీన్ని అవకాశంగా తీసుకున్న లింగయ్య సరోగసీ (అద్దె

పూలకుండీలు నవల
రచయిత: శిరంశెట్టి కాంతారావు
పేజీలు:136, వెల:100
ప్రతులకు: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో

గర్భం) ప్రతిపాదనను శాంతమ్మ ముందు పెడతాడు. దీనికి ఫ్లాష్‌బ్యాక్‌లో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసుకునే కిశోర్, అనితలు తమ ప్రొఫెషన్‌లో పడి పిల్లలు పుట్టే అవకాశాన్ని కోల్పోతారు. డాక్టర్ విశ్వామిత్ర సలహా మేరకు సరోగసీ ద్వారా బిడ్డను పొందేందుకు సిద్ధపడతారు. బొంబాయి నుంచి వచ్చిన ఎల్లయ్య విషయం తెలుసుకొని తల్లిదండ్రులు పిల్లలతో సహా ఆసుపత్రి ముందు బైఠాయిస్తాడు. ఆసుపత్రి తతంగమంతా ఆయా ద్వారా తెలుసుకున్న శాంతమ్మ 'కడుపున పుట్టిన బిడ్డలంటే ప్లాస్టిక్ సంచుల్లో పెంచే జామాయిలు మొక్కలు కాదు... వేళ్లు సాగంగనే ఆ సంచుల్లో నుంచి తీసి ఇంకోసోట నాటడానికి..'. అంటూ నెలలు నిండిన శాంతమ్మ ఆగ్రహంతో ఊగిపోతుంది. ఆయా సాయంతో ఆసుపత్రి నుంచి తప్పించుకుంటుంది. ఆ తర్వాత ఏం జరిగిందనే దాన్ని ఆసక్తికరంగా మలిచారు రచయిత.

సరోగేట్ మదర్స్ నిజంగా పాల్వంచలో ఉన్నారో లేదో తెలియదు కానీ... సరోగసీ అనే ఒక వాస్తవిక అంశాన్ని తీసుకొని, స్థానికతతో మేళవించి.. అద్భుతంగా రాశారు. భాష, యాస, వారి జీవన విధానం, ఎల్లయ్య-శాంతమ్మల అన్యోన్యత... చక్కగా చిత్రించారు. 'గర్భాశయ ఇబ్బందుల కారణంగా సంతానం పొందలేకపోతున్న కొందరు స్త్రీల దుఃఖాన్ని రూపుమాపడం కోసం కనుగొనబడిన ఈ సరోగసీ ప్రక్రియను కూడా కొంతమంది స్వార్థపరులైన డాక్టర్లు తమ వృత్తి ధర్మానికి భిన్నంగా, కేవలం డబ్బు కోసం దుర్వినియోగం చేస్తున్నారు..' అంటూ డాక్టర్ విశ్వామిత్ర ద్వారా సరోగసీ పట్ల తన అభిప్రాయాన్ని రచయిత స్పష్టం చేశారు. రచయిత ఎనుకున్న కథావస్తువుకు శిల్పం మరింత వన్నె తెచ్చింది. ఎక్కడా సుత్తిలేకుండా సూటిగా సరోగసీ విధానం దుర్వినియోగమౌతున్న వైనాన్ని, దానివల్ల జరుగుతున్న అనర్థాలను ఎండగట్టారు. దీనిపై రచయిత చేసిన పరిశోధన, పరిశీలన, దానికి నవలా రూపం ఇవ్వడంలో చూపిన చాకచక్యానికి రచయిత శిరంశెట్టి కాంతారావు గారిని అభినందించాలి.

- రాజాబాబు కంచర్ల

ఆకాశంలో సగమనే మహిళ విజయానికి సాక్ష్యం మణిపూర్‌లోని మదర్ మార్కెట్. 5 శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ మార్కెట్‌ను 5 వేల మంది మహిళలు నడుపుతున్నారు. అమ్మకాలు, వ్యాపార లావాదేవీలన్నింటినీ కేవలం మహిళలే చూసుకుంటారు. తల్లిలాంటి ఈ మార్కెట్ మహిళా చైతన్యానికి కేంద్రం.

తల్లి లాంటి మార్కెట్

ఇమాకెయిథెల్‌ను ఆసియాలోనే అతిపెద్ద మహిళా మార్కెట్ అనవచ్చు. 'ఇమా' అంటే తల్లి (మదర్), కెయిథెల్ అంటే అంగడి (మార్కెట్). ఇక్కడ అన్ని స్టాల్స్ మహిళలవే. ఈ మార్కెట్ మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఉంది. ప్రతిరోజూ కొన్ని వేల మంది వినియోగదారులతో వర్తకం నిర్వహిస్తున్నారు. ఈ మార్కెట్‌లో ఒక్క పురుషుని స్టాల్ కూడా లేకపోవటం విశేషం. మణిపూర్‌ను రాజులు పరిపాలించే 1592-1652 మధ్యకాలంలో వెలిసిన మార్కెట్లలో ఇదొకటనే వాదన ఉంది. అప్పట్లో లల్లప్ సాయుధ సైన్యం సంప్రదాయ పద్ధతి అమలులో ఉండేది. మెయితీ తెగకు చెందిన పురుషులు రాజుకు సేవకులుగా ఉంటూ, రాజు నుంచి ఎప్పుడు పిలుపు వస్తే అప్పుడు కార్యక్షేత్రానికి వెళ్ళవలసివచ్చేది. సేద్య వ్యాపార సంబంధమైన బాధ్యతలు స్త్రీలపైనే ఉండేవి. అలా వ్యాపార సామర్థ్యం వారిలో బలపడింది. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, కేవలం వివాహిత స్త్రీలకు మాత్రమే వ్యాపార నిమిత్తం మార్కెట్‌లో ప్రవేశం ఉంటుంది.

పోరాటాలున్నాయ్

ఇక్కడి వ్యాపారాన్ని, మహిళల స్వాతంత్ర్యాన్ని బలహీన పరచాలని ఎన్నో శక్తులు ప్రయత్నించాయి. బ్రిటీష్‌కాలంలో దోపిడీ విధానాల్ని నూపీలాల్ మహిళా పోరాటాలతో తిప్పికొట్టారు. స్వాతంత్ర్యానంతరం 1948-52 మధ్య కాలంలో అక్కడి ధనిక వర్గాల నుంచి ఈ మార్కెట్ కూలదోయాలనే ప్రతిపాదనకు సమ్మతి ఇవ్వమని ఒత్తిడి వచ్చింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటీష్, జపాన్ దళాలకు ఇంఫాల్ యుద్ధభూమిగా మారినపుడు మాత్రమే ఈ మార్కెట్ పూర్తిగా మూసివేయబడింది. 2003లో స్థానిక ప్రభుత్వం కెయిథిల్ స్థానే ఓ ఆధునిక సూపర్ మార్కెట్ నిర్మించాలని వ్యూహం పన్నింది. కానీ మహిళా వాణిజ్య సంఘం ఈ వ్యూహాన్ని తిప్పికొట్టింది.

సాంఘిక కేంద్రం

ఈ స్థలం ఎప్పుడూ భిన్న ఆచారాలు, సంప్రదాయాలు, తెగలకు చెందిన మహిళా వర్తకులతోనూ, ప్రపంచంలో వివిధ దేశాలకు చెందిన పర్యాటకులతోనూ నిండి ఉంటుంది. సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (CORE) 2005 రిపోర్ట్‌లో 'కెయిథిల్ కేవలం వర్తక కేంద్రం మాత్రమే కాదు. సాంఘిక, రాజకీయ అంశాలకు సంబంధించిన అభిప్రాయాల మార్పిడి జరిగే స్థలం కూడా' అని తెలియజేసింది. భోజన సమయంలోనూ, విశ్రాంతి సమయంలోనూ ఇక్కడి మహిళలు సాంఘిక రాజకీయ అంశాలను చర్చిస్తూ ఉంటారు. ఈ విధమైన సమాచార స్రవంతి వీరిని ఎల్లప్పుడూ జాగురూకులుగా ఉండేందుకు తోడ్పడుతుంది. ఇక్కడి మహిళలు కేవలం వ్యాపార నిర్వాహకులే కాదు నాయకత్వ లక్షణాలకు, విప్లవ భావాలకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చు.

ఈ మార్కెట్‌లో ముఖ్యంగా రెండు ప్రధానమైన సెక్షన్‌లు ఉంటాయి. ఒకచోట పండ్లు, కూరగాయలు, మిఠాయిలు వంటివి అమ్ముతారు. మరో చోట రాష్ట్రానికి చెందిన హస్తకళలు, దుస్తులు వంటివి లభ్యమవుతాయి. ఇక్కడ ఎక్కువ శాతం దుకాణాలు తల్లి నుండి సంక్రమిత ఆస్తిగా పిల్లలకు, ఎన్నో తరాల నుంచి అందిస్తూ రావటం గమనించదగ్గ విషయం. 81 యేళ్ళ వృద్ధ మహిళా వ్యాపారి అనౌబీ దేవి.. ఎక్కడైతే ఆమె నాలుగు తరాల పూర్వీకులు వ్యాపారం సాగిస్తున్నారో ఎన్నో ఏళ్ళ నుంచి అదే స్థానంలో కూర్చుని వ్యాపారం నిర్వహిస్తోంది. చాలామంది మహిళలకు ఇది కుటుంబ వ్యాపారం వంటిది.

ఆదాయమెలాగున్నా..

ఇక్కడి స్త్రీలు సంవత్సరానికి 73 వేలు - 2 లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఎక్కువ అమ్మకాలు జరిపినప్పటికీ, సంపాదన మాత్రం తక్కువే. ఎందుకంటే ఈ వస్తువులు తయారీకి అవసరమైన ముడిసరుకులకే ఎక్కువ ఖర్చవుతుందని అంటారు ఇంఫాల్ కాలేజ్‌లో హిస్టరీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా డా॥ యుమ్‌ఖాయిబామ్ శ్యామ్‌సింగ్. రవాణాకయ్యే ఖర్చులు అధికంగా ఉండటం వల్ల వీరికి లభించే ఆదాయం అంతంత మాత్రమే అని వారి పరిస్థితిని వివరిస్తారు స్వతంత్ర్య పరిశోధకురాలు డా॥ సృష్టి పుఖ్‌రెమ్.

అధిక మొత్తంలో చొచ్చుకు వస్తున్న చౌకబారు వస్తువులు, మరియు మన, ఇతరదేశాల టెక్నాలజీ ప్రభావం వల్ల ఈ మార్కెట్‌లో ఇప్పటికీ భయాందోళనలు ఉంటూనే ఉన్నాయి. స్థానిక వడ్డీ వ్యాపారుల దోపిడీ నుండి తప్పించుకోవటం కూడా వీరికి ఓ సవాలుగానే ఉంది. ఈ మణిపూరీ మహిళల గట్టి పట్టుదల, ఉత్సాహమే వారిని కలిపి నడిపిస్తోంది.

-సింహాద్రి నాగ శిరీష

జీవితం

టిప్పీ జంగిల్ బుక్

తన అన్న ఓ ఏనుగు. ప్రాణ స్నేహితుడేమో ఓ చిరుత. తన ముద్దు పేరేమో ముంగిస. తన ఆటస్థలమేమో అడవి. ఏంటి మొన్నామధ్య థియేటర్లలో తెగాడిన మోగ్లీ సినిమా 'జంగిల్ బుక్' కథ చెబుతున్నాననుకుంటున్నారా. నిజంగా జరిగిన ఆ కథ అలాంటిదే కానీ కేరెక్టర్లే వేరు. టిప్పీ అనే ఓ చిన్నారి పదేళ్ల పాటు నమీబియా అడవిలో జంతువులతో కలసిమెలసి గడిపింది. విస్మయపరిచే ఈ చిన్నారి కథ ఇదే.



ఫ్రాన్స్‌కు చెందిన సిల్వీ రాబెర్ట్, అలైన్ డెగ్రె దంపతులు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు. దాన్నే వృత్తిగా మార్చుకుని ఆఫ్రికాలోని జీవ వైవిధ్యంపై ఫొటో జర్నలిజం డాక్యుమెంటరీలకు పనిచేసేవారు. అలా వారు 1990లో నమీబియా కూడా వెళ్లారు. అక్కడకు చేరాక తెలసింది సిల్వియా గర్భవతి అని. ప్రకృతి ప్రేమికులైన ఆ ఫ్రెంచ్ దంపతులు తమ బిడ్డకు అదే సరైన ప్రాంతమని అక్కడే ఉండిపోయారు. ఎందుకంటే అంతకు ముందు కలహారి ఎడారుల్లో మీర్కట్ ప్రాణుల మధ్య వారు ఆరేళ్ల పాటు గడిపారు. ఈ ఆరేళ్లలో ఆ జీవాలతో చక్కటి అనుబంధాన్ని ఏర్పర చుకున్నారు. టిప్పీ పూర్తి పేరు టిప్పీ బెంజమిన్ ఒకాంటి డెగ్రె. ఒకాంటి అంటే స్థానిక నమీబియా సాన్ తెగ భాషలో ముంగిస అని అర్థం. జంతువులే బంధువులు, మిత్రులుగా టిప్పీ పెరిగి పెద్దదైంది. వన్యజీవులే కాదు క్రూర మృగాలతోను టిప్పీ బంధం పెనవేసుకుపోవడంతో ఆమెను వాటి నుంచి దూరం చేయలేకపోయారు. అలా టిప్పీ పదేళ్ల వరకు వాటితోనే ఆడుకుంది. పొద్దున లేచింది మొదలు రాత్రుళ్లు నిద్ర పోయేవరకు అడవి, జీవులే టిప్పీ లోకం. నమీబియాలోని తెగల వారితో ఇట్టే కలసిపోయింది ఆ కుటుంబం. టిప్పీ అంటే స్థానికులకు ముద్దు. వారి వస్త్రధారణలో టిప్పీని ముస్తాబు చేయడమే కాదు. అడవిలో చుట్టూ తిప్పి చూపించేవారు. చదువు సంధ్య అంతా కూడా అడవే. ఇదే విషయంపై సన్నిహితులు టిప్పీ తల్లిదండ్రుల్ని నిలదీస్తే టిప్పీ కంటే గొప్ప బాల్యాన్ని అనుభవించే వాళ్లు బహుశా ప్రపంచంలో ఉండరేమో సినిమాల్లో తప్ప.. అని వాళ్ల అనుమానాల్ని, భయాల్ని కొట్టేసేవాళ్లు. నిజమే మరి ఆస్ట్రిచ్‌కు తెగ నచ్చేసి టిప్పీని భుజానేసుకుని తిప్పింది. ఏనుగులు తొండంపై ఎత్తుకుని ఆడించేవి. చిరుతలు తమ ఒళ్లో నిద్రపుచ్చేవి. ముంగిసలు మట్టి ఎలా తవ్వాలో నేర్పించేవి. కోతులు ఉప్పెక్కి మారాం చేసేవి. తన వయస్సున్న జీబ్రా పిల్లలు టిప్పీతో కలసి బాటిల్ పాలు తాగేవి. చిలుకలు పలుకులు నేర్పేవి. టిప్పీకి వాటి సహచర్యంతో వాటి ఆలోచనా విధానమే వచ్చింది. ఎంతవరకు అవసరమో అంత వరకే అడవిని ఉపయోగించుకోవాలని. అబూ అనే ఏనుగుతో టిప్పీకి ఏడాదిన్నర వయసప్పుడే పరిచయమైంది. ఇక ఆ బంధం తెగలేదు. మరీ బుజ్జిగా ఉన్నపుడే టిప్పీకి ఏ మాత్రం అపాయం కలగకుండా జాగ్రత్తగా తిప్పేది అబూ. సాధారణంగా మనిషిని చూడగానే ప్రమాద మనుకునే జీవులు కాస్తా టిప్పీ విషయంలో వాటికి చెందిన ప్రాణిగా దగ్గరకు తీసుకునేవి. టిప్పీకి ముఫాసా అనే ఓ బాల్య స్నేహితున్నాడు. ఓ సింహం పిల్ల అది. ఏడాది తర్వాత మళ్లీ దాన్ని కలిసే సరికి టిప్పీ కన్నా ఎంతో భారీగా అయిపోయింది ముఫాసా. అయినా సరే టిప్పీని గుర్తు పట్టి తన తోకతో ఒంటిని నిమిరిందట అచ్చు పిల్లులెలా చేస్తాయో అలా. తోక తగిలిన బరువుకు టిప్పీ కింద పడిపోయిందట. ఇలాంటి ఎన్నో విషయాల్ని టిప్పీ గతేడాది తన పుస్తకంలో రాసింది. ఆఫ్రికా అడవి, జంతువుల మధ్య తన పదేళ్ల బాల్యానికి చెందిన ఎన్నో విషయాల్ని తన తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని వాటి ఫొటోలతో సహా ఈ పుస్తకంలో రాసుకొచ్చింది. అదే కాదు తర్వాతర్వాత ఆఫ్రికా వెళ్లిన ప్రతిసారి ఆయా జంతువులతో తనకు ఎదురైన భావోద్వేగ ఘటనలు, సందర్భాల గురించి చాలా ఆర్ద్రంగా జ్ఞాపకాలను, గురుతులను వివరించింది. టిప్పీ ఫొటోల్లో ఒకటి ఎంతో హృద్యంగా అనిపిస్తుంది. ఓ పెద్ద కప్పను ఏదో టెడ్డీ బేర్ బొమ్మలా హృదయానికి గట్టిగా హత్తుకుని ఉంటుంది అందులో అంత దగ్గరగా ఉంటుంది వన్యజీవులతో టిప్పీ. ఏమాత్రం అదురు బెదురు లేకుండా ఎలా వాటితో గడిపిందో తల్లిదండ్రులకు కూడా తెలీదు. పారిస్ విశ్వవిద్యాలయంలో సినిమా సబ్జెక్ట్ మీద డిగ్రీ చేసేప్పటికి టిప్పీలో ఎన్నో సంఘర్షణలు తలెత్తాయి. నిజానికి మనం ఉంటున్న ఈ కాంక్రీట్ జంగిలే ప్రమాదకరంగా తోచిందట. అడవిలో స్వేచ్ఛగా ఉంటుంది. మనిషితో పోలిస్తే జంతువులు ఊహించుకునేంత ప్రమాదకరం కాదనేది తన మాట. టిప్పీకి ఆఫ్రికా వాసి అని చెప్పుకోవడమే ఎక్కువ ఇష్టం. పన్నెండేళ్ల వయసపుడే డిస్కవరీ చానెల్‌తో కలసి ఆరుకు పైగా డాక్యుమెంటరీలనుఆఫ్రికా వన్యజీవులపై తీసింది. ఆ తర్వాత ఫ్రాన్స్‌లోని ఫోర్ట్ బోయర్డ్‌లోని పులుల సంరక్షణ చూసుకుంది. టిప్పీ అన్నేళ్ల పాటు జంతువుల మధ్య పెరిగినా కూడా పెద్ద ప్రమాదకర పరిస్థితుల్లో అయితే ఎన్నడూ ఎదుర్కొంది లేదు. ఓసారి ఓ మీర్కట్ టిప్పీ ముక్కు కొరికిందట. ఆమెకు మూడేళ్లున్నపుడు ఓ బబూన్ జుట్టు లాగిందట. అదే బబూన్ 12 ఏళ్ల తర్వాత టిప్పీ వెళితే ఆమెను గుర్తించి తల నిమిరిందట. పాములు, మొసళ్లు కూడా టిప్పీ స్నేహితులయ్యాయి. 'టిప్పీ మై బుక్ ఆఫ్ ఆఫ్రికా' పుస్తకంలో ప్రతి పేజీ కూడా ఇలాంటి ఎన్నో ఆశ్చర్యకర అంశాలతో నిండి వుంటుంది. మడగాస్కర్‌లోను కొన్నాళ్లున్న టిప్పీ జీవితం అంతా కూడా పర్యావరణం చుట్టుతానే తిరుగుతోంది. పాతికేళ్లు పూర్తి చేసుకున్న టిప్పీ ప్రస్తుతం 'ఎల్ పెటిట్ ఎఫ్ఐసీఎంప' డైరెక్టర్‌గా పనిచేస్తోంది. ఇది బాలలకు పర్యావరణంపై అవగాహన కల్పించే ఫిల్మ్ ఫెస్టివల్ విభాగం.

- జే



నిర్భయ రుతువు

చట్టం తన పని తాను
చేసుకుంటూనే పోతుంది
రోడ్డు మాత్రం రక్తంతో
తడిసి పోతూనే వుంటుంది.
ఉన్నట్టుండి ఆకాశం
మేఘావృతమవుతుంది
ఉరుములూ మెరుపులతో కూడిన
జల్లులు మొదలవుతాయి
మట్టి శిల్పాలు మౌనంగా
కరిగిపోతూనే వుంటాయి
నిమిషానికో చేమంతి
గంటకో పూబంతి
రోజుకో గులాబీ
నేల రాలుతూనే వుంటుంది
ఎన్ని ఫిర్యాదులు చేసినా
ఎంత మొరపెట్టుకున్నా
యూనిఫామ్లో వున్న
తోడేళ్లు
నిద్ర నటిస్తూనే వుంటాయి
మృగాలు దాడి చేసిన
పూల ఆర్త నాదాలు
ఆగిపోయాకే
ముందుకు కదులుతాయి
గోడ చాటున పొంచి వున్న
ఆకలిగొన్న పులి
దారిన పోయే గులాబీ మీదకు
లంఘిస్తుంది
ఒక్కొక్కటిగా రెక్కల్ని చప్పరించి
కాడను నడిరోడ్డు మీద
ఊసేసి వెళుతుంది
పక్కనే నడుస్తున్న పాదాలు
చేతల చేతులుడిగిపోయి
సినిమా చూసినట్టు చూసి సాగిపోతాయి
లేదంటే ....ఓ సెల్ఫీ తీసుకుని
మురిసి-పోతాయి
జీవితం కథలు బోధించాల్సిన
తరగతి గదులు
విదేశాలకు యంత్రాలను
తయారు చేసే పనిలో
నిమగ్నమవుతాయి
మంచీ చెడు-మనసు మమత
చెరిగిపోయిన పాత సినిమాలా
మిగిలిపోయి
అవలక్షణాలే హీరో లక్షణాలుగా
వెండి తెరమీద చెలామణి అవుతాయి
ఐ.ఏ.ఎస్ పాసయిన అమ్మాయి విజన్
పోకిరీ డ్రైనేజి ప్రేమలో పడి
కొట్టుకుపోతుంది
ఇంటింటికో రంగుల బుస్ పెట్టె
ఇంటిల్లిపాదినీ కాటేస్తూనే వుంటుంది
రోడ్డు మీద కనిపించే ప్రతి ఆడపిల్ల
వెండి తెర మీద బొమ్మలానే
కనిపిస్తుంది వాడి కళ్లకు
బొమ్మతో ఆడుకోవాలనే చూస్తాడు
చట్టాల కత్తులతో ఈ విష వృక్షపు
ఆకుల్ని కత్తిరించటం కాదు
మూలాల్ని చెరిపేయాలి
వేళ్లను పెకలించాలి
ఇదొక నిర్భయ రుతువులా కాదు
ఆడపిల్లల అభయ ముద్రలా మారాలి

సిఎస్సార్

7093075453

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ :snehaweekly.praja@gmail.com

కథ



నా బిడ్డ నాకు చాలు...

- భమిడిపాటి గౌరీశంకర్
9492858395

“అన్నయ్యా... నీవైనా మా తమ్ముడికి చెప్పవూ... మన రాజు సంగతి నేను చెప్పాను ఉలుకు పలుకు లేదు” అంది రాజేశ్వరి.

రాజేశ్వరి నా మిత్రుడు సత్యనారాయణ చెల్లి. మా మధ్య పాతికేళ్ల స్నేహముంది. నన్ను అన్నయ్య అనే అంటుంది. వాళ్ల అబ్బాయిని మా అమ్మాయికి చేసుకోమని సరదా పట్టిస్తుంది.. పండగలకి పబ్బాలకి వచ్చినప్పుడు.

“ఇంతకీ దేని గురించి నా రికమెండేషన్” అన్నాను.

“అదే... రాజును ఇంటర్‌లో జాయిన్ చేయడం కోసం. ఇంత వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాడు. 9.9 వచ్చింది. ఒక కార్పొరేట్ కాలేజ్ వాళ్ళు అన్నీ ఉచితమే అన్నారు..అయితే ప్రవేశ రుసుముగా యాభై వేలు కట్టమన్నారు. రెండు సంవత్సరాలకూ కలిపి” అంది రాజేశ్వరి.

“గుడ్... నిజమే రాజు బుద్ధిమంతుడు. తెలివైనవాడు. చెబుతాను వాడు సహాయం చేయకపోతే నాకు తోచిన సహాయం నేను చేస్తాను నువ్వేమీ వర్రీ కాకు సరేనా...”

“మీరంతా ఉన్నారనే నా ధైర్యమన్నయ్యా” ఇంతలో ఇంట్లోంచి పిలుపు రావటంతో లోనికెళ్లిపోయింది.

మొన్న మేలో సత్యనారాయణ కూతురు పుష్పవతి అయితే అందరం కలుసుకున్నాం. బంధు మిత్రుల కలయికతో ఫంక్షన్ బాగా జరిగింది.

అతనిది నాది పాతికేళ్ల స్నేహం. అతనికి, నాకు సంతానం ఒకే విధంగా ఉంది. ఒక బాబు ఒక పాప. వాడి బాబు కూడా పదవ తరగతిలో 8.5తో పాసయ్యాడు. మా బాబుకు 9 పాయింట్లు, రాజేశ్వరి బాబుకు మాత్రం 9.9 అనేసరికి మా వాడికి ఇబ్బంది అనిపించింది. వాళ్ల అబ్బాయిది కేజీ నుంచి కాన్వెంట్ చదువే. మంచి మార్కులే వచ్చాయి కానీ టెన్త్‌లో ఎందుకిలా అయిందన్నది వాడి ఆలోచన.

అలా వాడి ఆలోచనల మధ్య రాజేశ్వరి కోరిన సహాయం చేయాలా... వద్దా... అనే సందేహంలో ఉండిపోయాడు. కేవలం నాలుగు నెలల వ్యవధిలో మరలా ఇలా కలుసుకోవడం యాధృచ్ఛికమే.

సత్యనారాయణ తల్లిదండ్రులు అతని చిన్నతనంలోనే చనిపోయారు. రాజేశ్వరి తనే ఇంటికి దిక్కయింది. పది వరకు చదివిన ఆమె చదువు ఆగిపోయింది. వారసత్వంగా దక్కిన రెండెకరాల వ్యవసాయం పల్లం కావటం... పక్కన వంశధార నదీ ప్రవాహం ఉండటం ఆ కుటుంబానికి ఆధారమైంది.

తన తమ్ముడిని పట్టుదలగా చదవమంది. అరెకరం నేల అమ్మి సత్యనారాయణను విశాఖపట్నంలో ఉంచి చదివించింది. ఏనాడూ తాను కష్టపడుతున్నానని అనుకోలేదు. ఆ లోగా ఆమె వివాహం, పిల్లలూ, బాధ్యతలు ఎక్కువ కాసాగాయి. రాజేశ్వరి భర్త కామేశం కూడా రైతే. అక్కా తమ్ముళ్లకు ఉన్న ఎకరన్నర నేలను సమానంగా పంపకాలు చేసి పెద్దల సమక్షంలో సెటిల్ చేసుకున్నా ఏనాడూ సత్యం వ్యవసాయం చేసిన పాపాన పోలేదు. దాని

మీద నయా పైసా పెట్టుబడి కూడా పెట్టలేదు. నయా పైస ఆదాయం కూడా బావను అడగలేదు.

సత్యం ఇంజినీరింగ్ పూర్తి చేయగానే అతనికి ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. అందరూ సంతోషించారు.. అతను తప్ప. అతని కోరిక డాక్టర్ కావాలని. కానీ ప్రభుత్వ ఉద్యోగం, పెళ్లి, పిల్లలు బాధ్యతలు ఇవన్నీ అతని ఆశలపై నీళ్లు చల్లాయి. ఇంటర్‌లో బైపిసి కాకుండా ఎమ్‌పిసిలో జాయిన్ చేశారు వాళ్ల నాన్న.

ఇప్పుడు అతని కొడుకుపైనే ఆశలన్నీ...ఎలాగైనా వాడు డాక్టర్ కావాలని. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వస్తే అవసరమైతే రష్యా, ఉక్రెయిన్‌లలో నైనా చదివించడానికి ప్రణాళికలు వేసుకున్నాడు. కొడుకుని ఒక మనిషిగా కాకుండా యంత్రంలా పెంచాడు. చిన్ననాటి నుంచి హాస్టల్ జీవితం వాడికి అలవాటు చేశాడు. కూతురు చదువుపైన శ్రద్ధ చూపలేదు అయినా ఆమె ప్రభుత్వ పాఠశాలలో బాగానే చదువుతున్నది. కుట్లు, అల్లికలు నేర్చుకుంటూ ఆటపాటల మధ్య, ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉల్లాసంగా గెంతులు వేస్తూ ఉంటుంది. కొడుకు రాజేష్ మాత్రం జైలు జీవితం అనుభవిస్తున్న వాడిలా ఉంటాడు. బాగానే చదువుతాడు.

ఈ విద్యా సంవత్సరంలో అనేక సామాజిక, ప్రాంతీయ ఒడిదుడుకుల వల్ల ఇంటర్ విద్యావ్యవస్థ ఒడిదుడుకులకు కేంద్రబిందువైంది. ఆగస్టు వరకు అడ్మిషన్లు అవుతున్నాయి. మొన్న ఆగస్ట్‌లోనే రాజేశ్వరి తన కొడుకును జాయిన్ చేద్దామనుకుంది కాని డబ్బు కుదరక మానుకుంది. అయినా సెప్టెంబర్ వరకు సమయముందని చెప్పడంతో డబ్బు కుదరక నాకు చెప్పింది. సరే నేను చేస్తానని చెప్పాను.

కానీ ఇంతలోనే ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు.

ఊహిస్తే...అది జీవితమెలా అవుతుంది?

• • •

కార్పొరేట్ కళాశాలల మధ్య అనేక రకాల పోటీలు వచ్చి మార్కులు, పాయింట్లు మధ్య ఓ అనివార్యమైన వ్యాపారపు వికృత క్రీడ ఆరంభమైంది. ఈ ఆటకు సమిధలు విద్యార్థులు. అవసరమైన వనరులు తల్లిదండ్రులు. ఇదో పోటీ యుగం. ఒక్క పాయింట్‌లో వందోవంతు మార్కులు తగ్గినా సదరు విద్యార్థి జీవితం ముగింపు దశకు వచ్చేసినట్లేనని ప్రచారాలు. లక్షలకు లక్షలు ఫీజులు మహిళలకు ప్రత్యేకమైన కళాశాల నిర్వహణ అని, ఏసి తరగతి గదులని, హైజీనిక్ వంట గదులని, న్యూట్రిషియనిస్ట్ సలహా మేరకు భోజన సదుపాయాలని రంగురంగుల కరపత్రాల ప్రచార పర్వంలో తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను రంగుటద్దాల్లో చూస్తున్నారు. అంతా బాగుంది... వెలిగిపోతున్నది... అనుకొని లక్షలు లక్షలు సంస్థల ముఖాన కొట్టి తమ



పిల్లల్ని సదరు కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే... అక్కడున్నది, జరుగుతున్నది ఏమిటి?

జైలులాంటి గదులు, జైలు జీవితం స్వేచ్ఛలేని బ్రతుకు... ఆట... పాట... పండుగ... ఏమీ అవసరం లేదు. తల్లిదండ్రులు నెలకో ఆదివారం వచ్చి బహుమతులు, నగదు రూపంలో వారి ప్రేమను చూపించి వెళ్లిపోతారు. రోగమొచ్చినా, కష్టమొచ్చినా, కన్నీరొచ్చినా, ఓదార్చే వారేరి? నేనున్నానని తనను అక్కున చేర్చుకునే వారేరి? మనుషులలో మానవత్వపు పొర కనుమరుగవుతున్న వేళ కన్నవారిని కన్నపేగే కాల్చేయాలని కసితో రగులుతున్న వేళ బంగారు భవిష్యత్ పేరిట బంగారు బాల్యాన్ని అక్రమంగా చిదిమేస్తున్న వేళ, భూమిపై గగన తలంలో... భూమి లోపల... జ్వలింపజేసిన యువకుల మేధస్సే అత్యంత శక్తివంతమైన ఉత్పత్తి స్థానమనే అబ్దుల్ కలాం గారి వ్యాఖ్యానానికి గోరీలు కడుతున్న వైనం. ఆత్మహత్యలు పెచ్చు పెరుగుతున్న వర్తమానంలో ఇంటర్ కార్పొరేట్ విద్య, విద్యార్థులకు నేర్పిస్తున్న సృజన ఏమిటి? భవితవ్యం ఏమిటి? తల్లిదండ్రులు సహితం తమ తమ ఆశలు ఆశయాలు పిల్లలకు అందజేసి వారిని హింసకు గురిచేయడం సమంజసమా...? నెల రోజుల్లో ఓ కార్పొరేట్ కళాశాల విద్యార్థులు ఇరవై మంది చనిపోతే సదరు కళాశాల యాజమాన్యంపైన ప్రభుత్వం కనీసం చర్యలు కూడా తీసుకోకపోవటం విద్యార్థుల ప్రాణాలకు ఎంత విలువ ఉందో తెలుపుతోంది. సదరు సంస్థ యజమాని ఎన్నికల సమయంలో ప్రభుత్వం నడుపుతున్న పార్టీకి ప్రచార ఖర్చులకు గాను రెండు కోట్లు పెట్టుబడిగా పెట్టాడని వినికిడి. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఇంటర్ విద్య అమ్ముడుబోయిన వర్తమానంలో పసిప్రాణాలు గాలిలో కలసిపోతే ఇందుకు తల్లిదండ్రుల అత్యాశ కూడా తోడైతే...! మరో గొప్ప విషయమేమిటంటే సౌకర్యాల లేమి ఇందుకోసం ప్రభుత్వం ఒక కమిటీని వేస్తే సదరు కమిటీ నివేదికలో..... అన్నీ వెలిగిపోతున్నాయని రాసేశారు. అందరు కమిటీ సభ్యులూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్సే. ఓ ప్రజాస్వామ్యవాది కోర్టులో ప్రజావాజ్యం వేస్తే నిజం తెలిసింది. ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిలో భాగంగా ఏభై ఆరు శాతం కళాశాలలో కనీసపు మరుగుదొడ్ల సౌకర్యం లేదని... అవన్నీ కార్పొరేట్ కళాశాలలే గుడ్డి కమిటీలు గుడ్డి నివేదికల వలన విద్యార్థులను ఎవరు రక్షిస్తారు?

• • •

'ఏంటయ్యా... దీర్ఘంగా ఆలోచిస్తున్నావు. రాత్రవుతున్నది సత్యం రాలేదు. మరదలు గత రెండ్రోజులుగా పచ్చి మంచి నీళ్లయినా ముట్టలేదు పద అలా ఏటి ఒడ్డుకు వెళదాం" అంది రాజేశ్వరి. ఇద్దరం బయలుదేరాం బయట వెన్నెల. మాది వంశధార నది ఒడ్డున ఉన్న చిన్న గ్రామం.

రాత్రి ఎనిమిది గంటల సమయం....

దూరంగా నదికి ఆనుకొని ఓ పెద్ద మర్రి చెట్టు దాని చుట్టూ సిమెంట్ చప్టా, దాని మీద పడుకొన్న నా మిత్రుడు సత్యనారాయణ నన్ను చూసి బోరుమన్నాడు.

"ఎంతోమంది నన్ను హేళన చేశారు.

మా మామయ్య గారు ఒకసారి అల్లుడుగారూ.. మీకో అబ్బాయి పుట్టాడట.. కనీసం వాడి ఫోటో అయినా చూపండి తాతగా ఆనందపడతాను అన్నారు." చెప్పడం ఆపాడు. వాడి గొంతులో జీర... "మా నాన్న గారు కూడా... అవున్రా...నీ బాల్యం స్వేచ్ఛగా ఆటపాటలతో ఆనందంగా గడిపావు. నువ్వేమీ చదువు లేకుండా చెడిపోలేదే. మరి ఆ బాల్యపు ఆనందాలు నీ కొడుక్కెందుకివ్వవురా..! వాడిని కనీసం రెండు రోజులైనా పంపరా.. ఈ ముసలి ప్రాణాలు మనవడి కోసం ఎంత తపిస్తున్నాయో. నీవు తాతవైతే తెలుస్తుందిలే. అని ఏడ్చారు కానీ ఇలా అయ్యింది." అంటూ బోరుమన్నాడు. దు:ఖం ఆగలేదు.

రాజేశ్వరిని పట్టుకొని ఏడ్చేశాడు. నేను ఓదార్చే ప్రయత్నం చేయలేదు. ఏడవనీ ఎంత ఎక్కువ బరువును మోయగలడు అనే దాని మీద కాదు ఎంత బాధను భరించగలడు అనే దానిపైనే మనిషి శక్తి ఆధారపడి ఉంటుంది.

రాజేష్ నన్నడిగన ప్రశ్నలు నాకింకా గుర్తున్నాయి. అవే ప్రశ్నలు తన తండ్రిని కూడా అడిగాడట కానీ సమాధానాలు రాలేదట. రావని నాకు తెలుసు అంకుల్ అన్నాడు. అంత చిన్న బుర్రలో ఎంత పెద్ద ఆలోచన.

"ఎందుకంకుల్ మాకీ శిక్ష? మీరంతా ఎదగలేదా? బాధ్యతగా నిలవలేదా? సృజన, స్వేచ్ఛ లేని విద్య విద్యార్థికి అక్కరకొస్తుందా అంకుల్. ఒక్కొక్కసారి పారిపోదామనిపిస్తుంది. ఈ మధ్య నా స్నేహితుడు ఓ అర్ధరాత్రి వేళ గోడ గెంతి రోడ్డు మీదకు పరుగెత్తాడు. అంతకు ముందు వాడు వాడి ఫ్రెండ్స్ అలా రెండు మూడు సార్లు బయటకు వెళ్లి దాబా దగ్గర రొట్టెలు, చికెన్ వంటివి తిని బీరు తాగొచ్చారు. ఈ సారీ అలానే అనుకున్నాడు కానీ తొందర్లో రోడ్డు మీద వస్తున్న లారీని గమనించక గుద్దేశాడు." అని కళ్లమ్మట నీళ్లు పెట్టుకున్న సంగతి గుర్తుంది. "అయ్యో అదెలా సాధ్యం సెక్యూరిటీ ఉంటుంది, సిసి కెమేరాలుంటాయి కదా?" అని నేనడిగితే, నా అమాయకత్వానికి నవ్వి "సెక్యూరిటీ వారికి ఓ బాటిల్ తెచ్చేస్తే సరి. అన్నీ వాళ్లే చూసుకుంటారు" అన్నాడు. నిజమే ఈ మధ్య ఓ ఇంజనీర్ కాలేజ్‌లో ఎన్ఆర్ఐ కోటాలో చదువుకుంటున్న ఓ ఏడుగురు నేపాలీ కుర్రాళ్లు బారువా సముద్రంలో కొట్టుకుపోతే కాని ఆ కాలేజీలోని సెక్యూరిటీ విభాగం పనితీరు ప్రపంచానికి తెలీలేదు. పాపం వారిలో ముగ్గురు బతికి బయటపడ్డారు. మిగిలిన నలుగురు గల్లంతైయ్యారు.

"అన్నయ్యా..!. నువ్వు తమ్ముడు కలసి రండి. నేను వెళ్లి ఇంట్లో పనులు చూస్తాను" అంది రాజేశ్వరి.

సమయం రాత్రి తొమ్మిదిన్నర కావస్తోంది. అక్టోబర్ నెల కావడంతో గాలి చల్లగా వీస్తోంది. వెన్నెల వంశధార నిండా పరుచుకుంది. ఇసుక తెల్లగా మెరుస్తున్నది.

"పిల్లల మీద ఆశలు తప్పా?" నా మిత్రుని ప్రశ్న.

"కాదు... ఆ ఆశలు తీర్చే స్థానంలో వారు ఉన్నారా లేదా అని ఆలోచించకపోవటం తప్పు.

లక్షలకు లక్షలు పోసి వ్యాపారం చేయటానికి వారు వస్తువులు కాదు పిల్లలు ప్రాణమున్న పసివాళ్లు. "కాని ప్రాణాలు తీసుకొని... తల్లిదండ్రులను దు:ఖపెట్టడం ఎంతవరకు సమంజసం" మిత్రుని కళ్లలో కన్నీరు వెన్నెల్లో వెండి కత్తిలా ఉంది.

"నీ కొడుకుని చంపింది నువ్వు...ఈ కాలేజి వాళ్లు. చదువు ప్రాణం కన్నా కష్టమైనదని, చావు దాని కన్నా సుఖమైనదని నమ్మే డిప్రషన్‌లోకి పిల్లల్ని నెట్టేస్తున్న విద్యా వ్యవస్థల్లో అందరూ దోషులే." అన్నాను.

"సంస్కరించవలసిన అవసరం లేదా" నా మిత్రుని ప్రశ్న.

"ఉంది కాని సంస్కరించవలసింది తల్లిదండ్రులనే... పిల్లలు తమ ఆశల రూపాలని తల్లిదండ్రులంటారు. తమ ఆశయాలకు మార్గదర్శకులు తల్లిదండ్రులని పిల్లలనుకుంటారు. కాని చిత్రం ఏమిటంటే ఎవరి భావనలు ఎవరికీ చెప్పరు. పద ఇంటికి వెళదాం. మరదలు కూడా రెండు రోజుల నుంచి ఏమీ తినలేదట బిడ్డ పోయిన దు:ఖం ఎవరికైనా దు:ఖమే కాని. ఇది కేవలం ఓదార్పు మాత్రమే. మీ నష్టం తీర్చలేనిది..." నా మిత్రుణ్ని గట్టిగా కౌగిలించుకున్నాను.

అతని దు:ఖం చెలియలి కట్టను దాటింది.

ఇద్దరం ఇంటికి చేరుకున్నాం. గుమ్మంలో కుడి పక్కన వారగా ఓ ప్లాస్టిక్ కుర్చీలో...

రాజేష్ చిరునవ్వులు చిందిస్తున్న ఫోటో... నుదిటిన పెద్ద బొట్టు, ఫోటోకు ఓ దండ. ముందు ఓ దీపం. పదహారేళ్లకే వందేళ్ల జీవిత సారాన్ని సమాజరీతిని చదివేసి తొందరగా వెళ్లిపోయిన రాజేష్.

తనకు చదువు రాదని, చదవలేనని సూసైడ్ నోట్ పెట్టి తల్లిదండ్రులకు చెల్లికి క్షమాపణలు కోరిన రాజేష్.. ఆ తల్లి దు:ఖాన్ని ఎవరాపగలరు...? ఆ కన్నీటికి అడ్డుకట్టు ఎవరు వేయగలరు. కాలమొక్కటే ఆ పని చేయాలి. ఆ రాత్రి పదకొండు గంటల సమయంలో నేను, మిత్రుడు సత్యం కూర్చొని రాజేష్ జ్ఞాపకాలు పంచుకుంటున్న వేళ రాజేశ్వరి వచ్చి తన తమ్ముడి పక్కన కూర్చుంది.

"అక్కా..! ఏదైనా చెప్పాలనుకుంటున్నావా? రాజు సంగతి నాకొదిలేయ్. ఇక నుంచి వాడు నా కొడుకు సరేనా" అని భరోసా ఇచ్చాడు. "వద్దురా తమ్ముడు... మా రాజును గవర్నమెంట్ కాలేజీలో చేర్పిస్తా. బ్రతుకును సరిదిద్దవలసిన చదువే బ్రతుకు దీపాన్ని ఆర్పేస్తుంటే లక్షలు పోసి ఆ దిక్కుమాలిన చదువుల వెంట ఎందుకు పరుగెత్తాలి. వద్దురా నా బిడ్డ నా కళ్ల ముందు తిరుగాడుతుంటే చాలు.. తిరుగాడుతుంటే చాలు..." ఏడుస్తూ నోట్లో చీర చెంగు కుక్కుకుంటూ వెళ్లిపోయింది. మేమిద్దరం నిశ్శేష్టులయ్యాం. ✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

పొట్లకాయ పెరుగు పచ్చడి



తయారుచేసే విధానం

ముందుగా ఒక మందపాటి గిన్నెలో ఒక స్పూన్ నూనె, కొద్దిగా నీరు, కొంచెం ఉప్పు వేసి పొట్లకాయ ముక్కల్ని ఉడకబెట్టాలి. ముక్కలు పూర్తిగా ఉడికిన తర్వాత ఒక ప్లేట్‌లోకి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో పెరుగు, ఉల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. పొట్లకాయ ముక్కలు చల్లారాక వాటిని పెరుగు మిశ్రమంలో కలపాలి. ఇప్పుడు ఒక ప్యాన్‌లో నూనె వేసి వేడెక్కాక ఎండు మిర్చి, ఆవాలు, కరివేపాకు, జీలకర్ర వేసి పోపు సిద్ధం చేసుకోవాలి. కొద్దిగా చల్లారాక పెరుగు పచ్చడి మిశ్రమంలో పోపును కూడా వేసి బాగా కలిపి కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. పెరుగు పచ్చడి అన్నంతో పాటు తింటే రుచిగా ఉంటుంది.

కావాల్సిన పదార్థాలు

పొట్లకాయ ముక్కలు -3 కప్పులు
పెరుగు -1 కప్పు
ఉల్లిపాయ -1
పచ్చిమిర్చి -3
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు
కరివేపాకు - 5 రెబ్బలు
నూనె - 2 టేబుల్ స్పూన్లు
ఎండుమిర్చి ముక్కలు-1 టేబుల్ స్పూన్
కొత్తిమీర తరుగు -1కప్పు
తయారుచేసే విధానం

పొట్లకాయ రోల్స్



కావాల్సిన పదార్థాలు

సన్నని పొట్లకాయ -1
ఉల్లిపాయలు పెద్దవి- 2
బంగాళ దుంపలు- 2
అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టేబుల్ స్పూన్లు
కారం - 1 టేబుల్ స్పూన్
నూనె - సరిపడా
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

ముందుగా పొట్లకాయపై పొట్టును ఒక స్పూన్‌తో గీరేసి రెండంగుళాల పొడవు ముక్కలుగా కట్ చేసుకోవాలి. తర్వాత ముక్కల్లో ఉండే పీచు, గింజల్ని తొలగించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బంగాళ దుంపల్ని కూడా ఉడికించి కొద్దిగా చల్లారనివ్వాలి. ఒక ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి ఉల్లిపాయ ముక్కల్ని వేసి వేయించుకోవాలి. ముక్కలు వేగుతున్నప్పుడే అల్లం, వెల్లుల్లి పేస్ట్, బంగాళ దుంప పేస్ట్, ఉప్పు, కారం కూడా వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఈ పదార్థాలన్నీ పేస్ట్‌లా అయ్యేలా బాగా కలిపి ఒక బౌల్‌లోకి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఉడికించి పెట్టుకున్న పొట్లకాయ ముక్కల మధ్యలో ఈ మిశ్రమాన్ని నింపాలి. తర్వాత ప్యాన్‌పై కొద్దిగా నూనె వేసి పొట్లకాయ ముక్కలు అన్ని వైపులా దోరగా వేయించి అన్నం, సాంబారుతో రుచి చూడండి.

పొట్లకాయ-తెలగ పిండి కూర

తయారుచేసే విధానం

ముందుగా పొట్లకాయని శుభ్రంగా కడిగి ముక్కలుగా కట్ చేయాలి. ఒక బౌల్‌లో తెలగ పిండి తీసుకుని కొద్దిగా నీళ్ల చిలకరించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేసి కాగిన తర్వాత ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. అందులో పొట్లకాయ ముక్కలు, ఉప్పు, పసుపు కూడా వేసి ఉడికించాలి. పొట్లకాయ ముక్కలు పూర్తిగా ఉడికిన తర్వాత తెలగ పిండి కూడా వేసి బాగా కలిపి మగ్గాక కారం వేసి మరోసారి కలపాలి. రెండు నిమిషాలు తర్వాత ఒక బౌల్‌లోకి కూరని తీసి చపాతీ లేదా అన్నంతో రుచి చూడండి.

కావాల్సిన పదార్థాలు

పొట్లకాయ - 1
తెలగ పిండి - 100 గ్రాములు
పచ్చి మిరపకాయలు -2
ఆవాలు- 1 టేబుల్ స్పూన్
జీలకర్ర -1 టేబుల్ స్పూన్
నూనె - 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు
కరివేపాకు - 5 రెబ్బలు
కారం - 1/2 స్పూన్





పదాలు పూరించండి

ఎయిర్ అనే ఇంగ్లిషు పదంతో ముగిసే కొన్ని వస్తువులు ఇక్కడున్నాయి. అయితే వాటి ఎదురుగా ఉన్న ఖాళీలను పై బాక్సులో ఉన్న అక్షరాలలో ఏదో ఒక దాంతో నింపితే వస్తువు పూర్తి పేరొస్తుంది. బొమ్మల ఆధారంగా ఏ వస్తువుకు ఏ అక్షరం సరిపోతుందో చూసి పదాలు పూరించండి!

_ _air

_air

air

_air

_ _air

జ: stair, pair, hair, chair

దారి కనిపెట్టండి

ఇక్కడున్న గొర్రె పిల్ల దారి తప్పిపోయింది. అది తిరిగి వాళ్ల అమ్మ దగ్గరికి వెళ్లే దారిని కనిపెట్టండి.



బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక స్టార్‌ని. ఇది నా చిన్ననాటి చిత్రం. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

జ: అల్లు అర్జున్

నీడ గుర్తించండి

ఇక్కడ ఒక గాలి పటాన్ని ఇచ్చాం. కింద ఉన్న నీడల్లో గాలి పటం అసలైన నీడ ఏదో కనిపెట్టి సున్నా చుట్టండి.



గుర్రమెక్కడ?

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఒక వ్యక్తి ముఖంలో ఒక గుర్రం కూడా దాగుంది. అదెక్కడుందో గుర్తించండి!





చుక్కలు కలపండి

గుర్తించండి

భూమ్మీద నివసించే జంతువులతో పాటు నీటిలో ఉండే కొన్నిటిని ఇక్కడుంచాం. అయితే నీటిలో ఉండే జంతువులను గుర్తించి సున్నాచుట్టేయండి.



కిక్ బాక్సర్

పిల్లలూ! హీరో విలన్‌ని టపీ టపీమని గుద్దుతూ చేసే పెద్ద పెద్ద ఫైట్లని సినిమాల్లో మీరు చూసే ఉంటారు. అయితే అచ్చం అలాంటి ఓ ఫైటర్ జమ్మూలోని శ్రీనగర్‌లో ఉంది. తనో సాదా సీదా ఫైటర్ కాదు. ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కి ఎంపికైన అతి పిన్న వయసున్న అమ్మాయిగా రికార్డు కొట్టింది. ఉత్తర కాశ్మీర్‌లోని బందీపోరా పట్టణంలో రెండో తరగతి చదువుతున్న ఆ అమ్మాయి పేరు తజముల్. కాశ్మీర్‌లోని గుడ్‌విల్ మిలిటరీ స్కూల్‌లో చదువుతున్న తజముల్ ఒకసారి 'దార్' స్టేడియం వద్ద నుండి వెళుతూ బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న కొంత మంది పిల్లల్ని చూసి అక్కడే నిలబడిపోయింది. చేతికి గ్లౌజులతో బాక్సింగ్‌లోని పంచ్‌లని ప్రాక్టీస్ చేస్తున్న ఆ క్రీడని తనూ నేర్చుకోవాలని అప్పుడే నిశ్చయించుకుంది తజముల్. తండ్రి గులామ్ మొహమ్మద్‌కి బాక్సింగ్‌పై తన అభిరుచిని చెప్పడంతో వెంటనే శిక్షణ కోసం 'దార్' స్పోర్ట్స్ అకాడెమీలో చేర్పించారు. జమ్మూ కాశ్మీర్‌లో గొప్ప బాక్సింగ్ క్రీడాకారిణిగా ఆరితేరిన తజముల్ 2015లో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచింది. అప్పటికి తజముల్‌కి ఏడేళ్లు. పదమూడేళ్ల తన ప్రత్యర్థిని కేవలం 15 నిమిషాల్లో ఓడించింది తజముల్. జాతీయ స్థాయి పోటీల్లో కనబరిచిన ప్రతిభ తనని ఇటలీలోని యాండ్రియాలో నిర్వహించిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిలబడేలా చేసింది. విదేశాలకు పంపే ఆర్థిక స్థోమత తండ్రికి లేకపోయినా తజముల్‌కి సైనికాధికారులు సాయమందించారు. బాక్సర్‌గానే కాకుండా డాక్టర్ అవ్వాలనుకుంటోంది తజముల్. కిక్ బాక్సింగ్‌లో తనతో దెబ్బలు తిన్న వారికి వైద్యాన్ని కూడా తానే చేయాలనుకుంటోంది తజముల్ మరి.

పదవినోదం... పదవికాసం - 18

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2		■	3		4	■	5	6
7		■	8		■	9		■	
	■	10		■	11		■	12	
■	13		■	14		■	15		
16		■	17		■	18		■	■
19		20			■		■	21	
	■	22		■	23	■	24		■
■	25		■	26	■	27			28
29				■	30	■	31		
32			■	33	■	34			

ఆధారాలు

అడ్డం

1. నదుల్లో నీళ్లు లేక నోళ్లు తెరిచిన ఆంగ్ల ఆనకట్టలు (3)
3. నీటిలో దీనిపై ప్రయాణిస్తారు (3)
5. తిరగబడిన ఆకు (2)
7. రాజ్‌కపూర్ నటించి, నిర్మించిన 1970 నాటి హిందీ చిత్రం -- నామ్ జోకర్ (2)
8. హాస్యనటులు వేలు, వీరభద్రరావు పేర్ల ముందుండేది (2)
9. సుడిగాలిలో మలి సగం కొట్టుకు పోయింది (2)
10. పొట్లకాయ లావు కాదు -- (2)
11. సోమవారానికి ఎల్లుండి (2)
12. చిత్రం, జయం సినిమాల దర్శకుడు (2)
13. జగత్తు, విశ్వం (2)
14. నిప్పు (2)
15. వసంత రుతువు (3)
16. 'చెరకుతియ్యగా'.. ఆద్యంతాలు (2)
17. పాలు అటు నుంచి (2)
18. ఆరోగ్యంలో తేడా (2)
19. తెలివి తక్కువ వల్లనే (5)
21. బాత్ రూమ్‌లో చేసేది (2)
22. అటు నుంచి కొత్తకు వ్యతిరేకం (2)
23. వయసు మళ్లిన వారికిది శత్రువే ప్రథమంలో (1)
24. లోతట్టు చివరికంటూ లేదు (2)
25. కాయలేని ఆవకాయ (2)
26. ఎండలు మండిపోతే తప్పదు ముప్పు రెండులో (1)
27. అమ్మ్యామ్మా నిమిత్తం (4)
29. తాజాగా బెంగుళూరులో జరిగిన --- క్రికెట్ ఫైనల్స్ (4)
30. దీని దెబ్బకు ఎందరికో మృత్యువాత మూడులో (1)
31. ఏడాది (3)
32. చింతపండుతో చేసే చారు (3)
33. అడ్డం 23,26,30 కలిపితే వేడిసెగలతో వేటు వేసేది (1)
34. బాహుబలిలో తమన్నా పేరు తడబడింది (4)

నిలువు

1. ఆంగ్లలో నష్టం, హాని, చెరుపు (3)
2. పైకి రాము (2)
3. దూది (2)
4. భూమి (3)
6. ఆక్సిజన్, ప్రాణవాయువు (4)
8. ఇది వేస్తే గోడ తెల్లగా ఉంటుంది (2)
10. అర్ధ భాగం (2)
11. ఇళ్లు తగులబడితే అయ్యేది (2)
12. తడి (2)
13. లోకం, జనం (3)
14. అమ్మ జోల పాడితేనే పాపాయికి నిద్ర 1,9,8 (3)
15. సిరి, సంపద (2)
16. వేసవిలో ఒంటి నుంచి ఉబికే స్వేదానికి మరో పేరు (3)
17. పాకలు పైకే (3)
18. ఆనందం, సౌఖ్యం (2)
20. చిరుప్రాయం (5)
21. విశ్వవిద్యాలయాల్లో సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమం (5)
24. 'కవచంలో' శీర్షాసనం (4)
25. పండు పండు పండు --- దీని పేరు (3)
28. తిరునాళ్ళ సంబరం 5,7,1 (3)
29. ఆచూకీ లేకుండా పోవడం (2)

సుడోకు

	6			3	4	5	7	8
	9	4			5			
					8	1	9	
9	2				6		4	
	5						8	
	4		8				3	5
	7	9	5					
			7			8	2	
3	8	2	4	9			5	

గతవారం జవాబులు

4	8	7	2	6	5	9	3	1
5	2	3	4	9	1	6	8	7
9	1	6	8	7	3	4	2	5
2	3	9	5	4	6	1	7	8
6	5	1	3	8	7	2	9	4
7	4	8	1	2	9	3	5	6
3	7	2	6	1	8	5	4	9
8	6	4	9	5	2	7	1	3
1	9	5	7	3	4	8	6	2

1 మ	2 మ	3 కా	రం	■	4 గా	5 బ	రా	■	6 తా
7 క	రు	గు	■	8 క	న	కం	■	9 రా	క
10 రం	గు	■	11 సై	న్య	ము	■	12 బ	కె	ట్టు
■	■	13 తా	ర	లు	■	14 వి	రా	ట్	■
15 అ	16 మె	జా	న్	■	17 నా	య	క్	■	18 క
19 పు	ళ్ల	గా	■	20 త	మ	న్నా	■	21 రో	సు
22 రూ	గా	■	23 జ	ల	ము	■	24 మ	హి	మ
పం	■	25 ఘ	ను	లు	■	26 వి	■	జీ	■
■	27 మ	న	వి	■	28 జ	■	29 య	■	30 టి
31 భ	ర	త	నా	ట్యం	■	32 న్	■	33 పీ	ట్

పూల హారాలు

పూల సోయగాలు కురులకే పరిమితమా.. కోమలాంగి కంఠానికి, కర్ణాలకి అంకితమైతే.. ఇంకెంత అందంగా కనిపిస్తాయో! అందుకే డెన్వర్‌కు చెందిన బటానికల్ ఆర్టిస్ట్ ఆడ్రియాన్నే డెలోయ్ సహజమైన పూలతో అందమైన పెండెంట్లను, దిద్దుల్ని చేస్తోంది. ప్రెస్ చేసిన పూలను ఎన్‌కాస్టింగ్ చేసి అద్దాల పెండెంట్లలో చేరుస్తుంది. అవెలా ఉంటాయంటే పెండెంట్ల లోపల అవి మొలిచినట్టుంటాయి. ఇలా ప్రకృతి అందాల్ని ఆభరణాల్లో ప్రిజర్వ్ చేస్తోందని ఆమె మాట.

కారు బొమ్మ ప్రయాణాలు

స్విట్జర్లాండ్‌లోని జూరాకు చెందిన కిమ్ లెవెన్‌బెర్గర్‌కు ఓ పుట్టిన రోజు సందర్భంగా తండ్రి ఓ పాత కారు బొమ్మ ఇచ్చాడు. దాని చూడగానే అలాంటి కారులో ప్రపంచం చుట్టాలనుకునేది. కానీ అది 60ల నాటిది. ఈలోగా 19వ పుట్టిన రోజు వచ్చింది. అప్పుడేమో ఓ డీఎస్ఎల్ఆర్ కెమెరాను కొనిపెట్టాడు. ఇక ఆమె కారు ప్రయాణం మొదలైంది. ఆ కారుల్లో చక్కర్లు కొట్టలేకున్నా ఆ బొమ్మలతో యాత్రలు చేస్తోంది. తాను ఓ ప్రాంతానికి వెళితే అక్కడకు వాటిని తీసుకెళ్లి ఫొటోలు తీసి ముచ్చట తీర్చుకుంటోంది. తాను చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆ కారు బొమ్మలు సబ్జెక్ట్‌గా చిత్రీకరిస్తోంది. ఈ కారు బొమ్మల ఛాయాచిత్రాలే ఆమెకు బోలెడు క్రేజ్ తెచ్చిపెట్టాయి. అదే ఫొటోగ్రఫీ వైపు కెరీర్‌ను మలుపు తిప్పాయి. తన తాతయ్య వాడిన లోమోగ్రాఫీ కెమెరాలను ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకుంది. పాత తరం అనలాగ్ కెమెరాలంటే ఆమెకు బోలెడు ఇష్టం. ఇవి తన తండ్రి వద్ద బోలెడున్నాయి. మొబైల్ ఫోన్‌తోను అద్భుతమైన చిత్రాలు తీసే స్థాయికి ఆమె ప్రతిభ చేరుకుంది. అదే స్థాయికి తన కారు బొమ్మ ప్రయాణాలు కూడా.

Check List

Book Number	KNSR028124	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	No		
Missing Pages	No		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	99